ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : **సద్గురు శ్రీ నాన్నగారు**

సంపుటి : 11 | సంచిక : 10 | జూన్ 2006



**రమణ భాస్కర**

ఆధ్యాత్మిక మాస పత్రిక

**పేజీలు : 32**

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

**చందా**
సంవత్సర చందా:రూ॥100/-
విడి ప్రతి : రూ॥ 5/-

చిరునామా
**రమణ భాస్కర**
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551


**ఈ సంచికలో....**


భీమవరం .......... 02-03-06
గుండుగొలను ... 22-03-06
పత్తేపురం .......... 26-03-06
భీమవరం .......... 05-02-06



ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, ☎ 08814 - 228858


# సీతమ్మ ధర్మాచరణ

సీతాదేవి ఆదర్శ వనిత. ఆమెలోని మేధాశక్తి, సహనం, విచక్షణ, ధర్మాచరణ, తపస్సు, ఆత్మ సంయమనం, భర్త పట్ల అచంచలమయిన భక్తి మొదలయిన ఉత్తమ లక్షణాలను స్త్రీలే కాకుండా పురుషులు కూడా గుర్తుంచుకొని, ఆచరించదగిన అంశాలు. సీతమ్మది చాలా విశిష్ఠమైన వ్యక్తిత్వం. రాముని వెంట అరణ్యవాసానికి వెళ్ళి సాధారణ జీవితం గడిపింది. ఎన్నో కష్టనష్టాలను భరించింది. వనవాసంలో రామునికి అండదండగా ఉంటూ, తన ఆలోచనా శక్తితో తర్కబద్ధమైన సలహాలను అందిస్తుంది. రాక్షసుల పట్ల ఎలాంటి శత్రుత్వం లేకుండానే వారిని సంహరిస్తానని రాముడు ఋషులకు వాగ్ధానం చేసినప్పుడు అందులోని ఔన్నత్యాన్ని ప్రశ్నిస్తుంది. సీతమ్మ తల్లి లంకలో తనను బాధించిన రాక్షసిని సంహరిస్తానని హనుమంతుడు అన్నప్పుడు కూడా “తప్పు చేయని వారే ఉండరు” అంటూ అతనిని వారించింది.

రావణుడు ఎన్ని ప్రలోభాలు పెట్టినా, ఎంతగా హింసించినా, భయపెట్టినా, బాధపెట్టినా కూడా లొంగకుండా తన వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకుంది. సమాజంలో ధర్మ ప్రతిష్ఠాపన కోసం శీల పరీక్షకు నిలబడింది. త్రిభువనాల సార్వభౌమత్వం కూడా సీతమ్మవారి పవిత్రత

**ముందు దిగదుడుపేనని హనుమంతుడు భావిస్తాడు. ఆమె అయోధ్యకు వచ్చిన తర్వాత జనవాక్యాన్ని పరిగణించి మళ్ళీ అరణ్యవాసం చేసినది కూడా ధర్మాచరణ కోసమే. అయోధ్యకు రాజుగా ధర్మ పరిరక్షణ చేయవలసిన బాధ్యత రామునికి ఉంది. అతని అర్థాంగిగా, సహధర్మచారిణిగా, మహారాణిగా సీతమ్మకు అంతే బాధ్యత ఉంది. సీతారాములకు ఒకరిపట్ల ఒకరికి సంపూర్ణమైన ప్రేమానురాగాలు, విశ్వాసము ఉన్నప్పటికీ, ధర్మాచరణకై జీవితాంతము వియోగం అనుభవించారు. ఈవిధంగా సీతమ్మ తల్లి జీవితమంతా ఎంతో సమన్వయంతో అద్భుతమైన తన వ్యక్తిత్వాన్ని చాటుకొంది. అందుకనే సీతమ్మ భారతీయ ఆదర్శ మహిళ అయింది.**

**- బొప్పన అరుణాదేవి,** హైదరాబాద్

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 02-03-06, భీమవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఉన్నది ఒక్కటే వస్తువు, అదే బ్రహ్మం. అది అంతటా ఉంది. మన హృదయంలో ఉంది. ఈ సృష్టి కంతకు ఆధారంగా ఉంది. అది శక్తివంతమైనది, జ్ఞానవంతమైనది. ఆ బ్రహ్మమును కాదని మనం ఏమీ చేయలేము. ఆ బ్రహ్మమునే కొంతమంది శివుడిగా, కొంతమంది వెంకటేశ్వరస్వామిగా, కొంతమంది దేవిగా ఆరాధిస్తున్నాము. మనకు ఇష్టమైన నామాన్ని స్మరించుకొంటూ, రూపాన్ని ధ్యానించుకొంటూ బ్రహ్మంలో ఐక్యం పొందవచ్చు. ఆగ్రహం తగ్గించుకోవటానికి, నిగ్రహం పెంచుకోవటానికి ఉపాసన ఉపయోగపడుతుంది. పెద్ద పెద్ద తపస్సులు, యాగాలు, యజ్ఞాలు చేసి తరించారు అని మనం పురాణాలలో చదువు తున్నాము. కాని ఈ కలియుగంలో పెద్ద పెద్ద యజ్ఞాలు, తపస్సులతో పనిలేదు, మీ కిష్టమైన భగవంతుని రూపాన్ని ధ్యానించుకొంటూ, ఆయన నామాన్ని స్మరించుకొంటూ ఉంటే మీరు తరిస్తారు అని పెద్దలు చెపుతున్నారు. అందుచేత కలియుగంలో మోక్షం పొందటం తేలిక. భగవంతుడి నామాన్ని స్మరించుకొంటూ ఉంటే మీరు ఈశ్వరుని దయకు పాత్రులవుతారు, మోక్షం పొందటానికి మీకు అర్హత, యోగ్యత కలుగుతుంది. మీరు శ్రద్ధగా చేసుకొంటే ఒక్క

నామస్మరణ చాలు మీరు తరించటానికి అని పెద్దలు చెపుతున్నారు. ఈశ్వరునిపట్ల ప్రేమభావన పెంచుకొంటూ ఆయనను స్మరించుకొంటూ ఆయనలో ఐక్యం అవ్వవచ్చు. మనం భగవంతుడిలో ఐక్యం అవ్వకుండా ఏవైతే వాసనలు అడ్డువస్తున్నాయో, ఏ కోరికలు అయితే మనకు అడ్డువస్తున్నాయో జాగ్రత్తగా చూసుకొంటూ వాటిని తొలగించుకోవటానికి మనం ప్రయత్నం చేయాలి, వాటిని తొలగించుకొంటే నీకు మోక్షం సిద్ధిస్తుంది. మనలో చిన్న బలహీనత ఉన్నా కూడా మనం భగవంతుడిలో ఐక్యం కాలేము. అందుచేత మనం బహు జాగ్రత్తగా ఉండాలి. మనం ఏదైనా మంచిపని చేస్తే అది అందరికీ తెలియాలి, అందరూ గుర్తించాలి అని అనుకోవటం కంటే పెద్దబలహీనత లేదు అని శాస్త్రంలో చెప్పారు. భగవంతుడు సంతోషిస్తే, భగవంతుడు ఇష్టపడితే నీకు మోక్షం వస్తుంది కాని లోకంలో జేజేలు కొట్టించుకోవటం వలన నీకు మోక్షం రాదు. ఇతరుల గొడవలు మనకు అనవసరం. మనం ప్రయాణిస్తున్న మార్గం సరియైనదో, కాదో మనం జాగ్రత్తగా పరిశీలన చేసుకోవాలి. మన మనస్సులో ఏమి ఉందో పరిశీలన చేసుకొంటూ, భగవదనుభవం పొందటానికి అడ్డు వచ్చే విషయాలు ఉంటే వాటిని ఒకో దానిని నెమ్మదిగా తొలగించుకొంటూ రావాలి.

మనం ముఖ్యంగా గుర్తుంచుకోవలసింది ఏమిటి అంటే దేహం వేరు, ఆత్మ వేరు, దానికి దీనికి అసలు సంబంధం లేదు, దేహం చనిపోతుంది, ఆత్మకు చావు లేదు ఇది ముందు మనకు అర్థమవ్వాలి. భగవంతుడు ఏమి చెపుతున్నాడు అంటే చెప్పే మాటలు పెద్ద పెద్ద మాటలు చెపుతున్నావు. ఎవరి గురించి దుఃఖపడవలసిన పనిలేదో వారిగురించి దుఃఖపడుతున్నావు అర్జునా అంటున్నాడు పరమాత్మ. బతికి ఉన్నవారు ఎప్పుడు చనిపోతారు అని కనిపెట్టుకొని ఉండకూడదు, చనిపోయినవారి గురించి దుఃఖపడకూడదు. ఆత్మజ్ఞానం పొందినవారు బతికి ఉన్నవారి గురించి కాని, చనిపోయిన వారి గురించి కాని దుఃఖపడరు. ఆత్మజ్ఞానానికి మించిన జ్ఞానం లేదు, ఆత్మవిద్యకు మించిన విద్య లేదు. ఆత్మకు దేహానికి ఎట్టి సంబంధం లేదు. ఏ వస్తువుకయితే చావులేదో ఆ చావులేని సత్వదార్థమే నీవు. అది నీకు అర్థమయితే దేహప్రారబ్దం అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా దుఃఖం నిన్ను ముట్టుకోదు, దుఃఖం యొక్క స్పర్శ నీకు అంటదు. నీకు తత్వం తెలిసినప్పుడు సుఖంగా, శాంతిగా ఉంటావు. ఈ జీవకోటికంతకు కారణం భగవంతుడు. ఇప్పుడు మనం భగవంతుడి లోనే ఉన్నాము. భగవంతుడికి భిన్నంగా ఏమీ లేదు. భగవంతుడికి భిన్నంగా ఏదో ఉంది

అని అనుకోవటం వలన మనకు దుఃఖం వస్తోంది. భగవంతుడి సంకల్పాన్ని అంగీకరించలేక పోతున్నాము, అందుచేత మనకు దుఃఖం వస్తోంది. భగవంతుడి సంకల్పాన్ని ఉన్నది ఉన్నట్లుగా అంగీకరించే వాడికి దుఃఖస్పర్శ ఉండదు. భగవంతుడి సంకల్పాన్ని అంగీకరించటానికే మనకు భక్తి, శరణాగతిభావన ఉండాలి. ఇది దేహం, ఇది ఆత్మ అని విడదీసుకోవటం మనకు బాగా తెలియాలి. అది తెలిస్తే దుఃఖం నశిస్తుంది. ఎక్కడో బయట విషయాలను పరిశీలన చేయటం కాదు, మన మనస్సును మనం పరిశీలన చేసుకోవాలి.

బ్రహ్మం లోపల ఉంది, బయట ఉంది, అంతటా ఉంది. అది రూపరహితం, నామ రహితం. ఆ రూపం లేనిదానిని, నామం లేనిదానిని మనం ధ్యానం చేయలేకపోతున్నాము. అంత బుద్ధిసూక్ష్మత మనకు లేదు. అందుచేత బ్రహ్మంకు ఏదో ఒక రూపం పెట్టి, ఒక నామం పెట్టి పరమేశ్వరుడి యొక్క ఆ ముఖంలో నుండి రూపం లేనిదానిని, నామం లేని దానిని పొందటానికి మనం ప్రయత్నం చేస్తున్నాము. నామరూపములు సపోర్టు మాత్రమే. మనం ఏ పని చేసినా, మాట్లాడినా, ధనం ఖర్చు పెట్టినా, దేశానికి సేవ చేసిన యజ్ఞభావనతో చేయమన్నారు. యజ్ఞభావనతో చేయటం వలన మనం పవిత్రులం అవుతాము. ఇప్పుడు మనం ఈ దేవాలయానికి వచ్చాము అనుకోండి. దేవాలయాన్ని శుభ్రం చేయటం ఇక్కడ ఉన్న దేవతా రూపానికి అర్చన చేయటం, దేశాన్ని కూడా తల్లితో సమానంగా ఆరాధించి దేశానికి మనం చేయగలిగింది చేయటం ఇటువంటి పనుల వలన హృదయం విశాలమవుతుంది, బుద్ధి యొక్క లోతులు పెరుగుతాయి. బుద్ధికి స్పష్టత వస్తుంది అంటే ఉన్న వస్తువును ఉన్నట్లుగా చూసే యోగ్యత మనబుద్ధికి కలుగుతుంది. మీరందరు ఈ సబ్జక్టు వింటున్నారు అంటే దాని వలన దైవభక్తి పెరగాలి, దైవభక్తి పెరుగుతూ ఉంటే మనస్సుకు చాపల్యం తగ్గిపోతుంది. దైవచింతన వలన మనస్సు పల్చబడిపోతుంది. విషయాలను చింతించటం వలన విషయాల మీద నీకు ఆకర్షణ కలుగుతుంది. విషయాల మీద ఎప్పుడైతే ఆకర్షణ కలిగిందో అప్పుడు కోరిక కలుగుతుంది. ఎప్పుడైతే ఆ కోరిక నెరవేరలేదో కోపం వస్తుంది. తరచుగా ఎప్పుడైతే నువ్వు కోపం తెచ్చుకొంటున్నావో అప్పుడు నీ బుద్ధి పాడవటం ప్రారంభమవుతుంది. మన బుద్ధి పాడవకుండా జాగ్రత్తగా చూసుకోవాలి. బుద్ధి పాడైపోయిన తరువాత ఎన్ని డిగ్రీలు ఉన్నా, ఎంత ధనం ఉన్నా ఏమీ ప్రయోజనం లేదు. అందుచేతనే విషయచింతన విషంతో సమానం అని మన పెద్దలు చెపుతారు.

మన మనస్సును మనం మిత్రుడిగా చేసుకొంటే అప్పడు మన మనస్సు చేసే ఉపకారం బయటవారు ఎవరూ చేయలేరు. స్వాధీనమైన మనస్సు మనకు చేసే ఉపకారం బయట సమాజం చేయలేదు. అందుచేత దేహానికి సంబంధించిన ఆరోగ్యం ఎంత ముఖ్యమో మానసికఆరోగ్యం కూడా అంతే ముఖ్యం. మీకు ఏదైనా అనారోగ్యం వచ్చింది అనుకోండి, మనస్సు శాంతిగా ఉంది అనుకోండి, పది రోజులలో తగ్గేది అయిదు రోజులలో తగ్గిపోతుంది. మీ శరీరానికి ఏదైనా రోగం వచ్చింది అనుకోండి అది తొందరగా తగ్గాలి అంటే మనస్సు కూడా మీకు సహకరించాలి. ఈ మర్మం అంతా మనస్సులో ఉంది. మీకు సంతోషం వస్తూ ఉంటుంది, దుఃఖం వస్తూ ఉంటుంది. ఏది వచ్చినా ఈవెన్ దిస్ విల్ పాస్ ఎవే అని దీనిని ఒక మంత్రంలాగ అనుకోండి. మీకు సంతోషం వచ్చింది అనుకోండి. ఇది ఏదో రోజున వెళ్ళి పోయేదే. అలాగే మీకు ఏదైనా దుఃఖం వచ్చింది అనుకోండి, ఇది ఎప్పడూ ఉండదు, ఇది కూడా ఏదో రోజున బయటకు పోయేదే అనుకోండి. ఇప్పడు మీకు శరీరం వచ్చింది అనుకోండి. ఇది ఎప్పడూ ఇలాగే ఉంటుంది అనుకోవద్దు, ఈ శరీరం ఏదో రోజున పోతుంది. ప్రతీదీ కాలప్రవాహంలో కొట్టుకొనిపోతుంది. కాలప్రవాహాన్ని అడ్డుకొని నిలబడేది ఏదీ లేదు. మన కళ్ళచేత చూడబడేవి అన్నీ నశించేవే. మాయ అంటే ఇదే. ఎండమావులలో నీరు ఉండదు, అక్కడ నీరు ఉన్నట్లు కనిపిస్తూ ఉంటుంది. అక్కడకు వెళ్ళి నీరు తాగి దాహం తీర్చుకొందాము అనుకోవటం ఎటువంటిదో లోకవిషయం ద్వారా సుఖం పొందుదాము అనుకోవటం కూడా అటువంటిదే. ఇదే భగవాన్ చెప్పారు లోకంలో ఎక్కడా సుఖం లేదు. నీ స్వరూపంలో తప్పించి, హృదయంలో తప్పించి సుఖం కాని, శాంతి కాని బయట లేనేలేదు. ఒకవేళ బయట ఉన్న విషయాల ద్వారా నీవు సంతోషం పొందుతూ ఉంటే భవిష్యత్‌లో ఈ సంతోషం అంతా కూడా దుఃఖంగా మారిపోతుంది. చాలామంది ఏదో ఊహించుకొని అశాంతిని, దుఃఖాన్ని తెచ్చుకొంటారు. మీరు ఏదీ ఊహించుకోవద్దు ఈశ్వరుని పాదాల మీద మీ మనస్సును నిలబెట్టి ఉంచండి, అన్నీ సక్రమంగానే జరుగుతాయి. ఈశ్వరుని కృప కనుక మీ మీద ఉంటే మీ దుఃఖం కూడా సంతోషంగా మారిపోతుంది. ఈశ్వరుడికి అసాధ్యం అంటూ ఏమీ లేదు. అయితే మనం భగవంతుడికి అర్చన చేసేటప్పడు, ఆయన నామాన్ని స్మరించేటప్పడు, ఆయన రూపాన్ని ధ్యానించేటప్పడు యాంత్రికంగా చేయకూడదు, ప్రేమగా ప్రీతితో చెయ్యాలి. ఏ పని అయితే మీరు ప్రేమగా చేస్తారో దానిని డైరెక్టుగా ఈశ్వరుడు

తన హృదయంలోనికి తీసుకొంటాడు.

నీటిలో నుండి బయటపడిన చేప ఎలా కొట్టుకొంటుందో, ఈ దేహభావనలో నుండి బయటపడటానికి కొంతమంది అలా కొట్టుకొంటారు. ఎంత సాధన చేసినా ఈ దేహాభిమానం విడిచిపెట్టటం లేదు. ఈ దేహం నేను కాదు కాని ఈ దేహానికి బంధింపబడిపోయాను, ఏనాటికి ఇందులో నుండి బయట పడతాను అని నీటిలో ఉన్న జంతుజాలం భూమి మీదకు వస్తే మరల నీటిలో పడిపోవటానికి ఎలా కొట్టుకొంటుందో అలాగ ఈ దేహాభిమానాన్ని విడిచిపెట్టి జ్ఞానగంగలో కలిసిపోవటానికి కొంతమంది అలా కొట్టుకొంటారు, వారికి మోక్షం కలుగుతుంది. ఈ శవబుద్ధిని విడిచిపెట్టి చైతన్యశ్రవంతిలో ఎప్పుడు ఐక్యం అవుతాము అనే తపన వస్తే ఆ జిజ్ఞాస కలిగితే వాడు సాధకుడు. దాహం లేనివాడు నీరు తాగలేడు, ఆకలి లేనివాడు అన్నం తినలేడు అలాగే జిజ్ఞాస లేకపోతే, భగవంతుడిని తెలుసుకోవాలి అనే కాంక్ష కనుక నీకు లేకపోతే దాని తాలుక సాధన కూడా మనం చేయలేము. ఏదో సాంప్రదాయం కోసం యాంత్రికంగా చేసినా భగవంతుడిలో ఐక్యం అవ్వలేము. ఆ ముముక్షత్వం ఎలా వస్తుంది అంటే పూర్వజన్మలలో సత్కర్మ చేసి ఉంటే, అది నిష్కామంగా చేస్తే నీకు ముముక్షత్వం వస్తుంది. మనం సాధన చేసి, యోగాభ్యాసాలు చేసి దేహభావన పెంచుకోవటం కాదు, దేహభావనలో నుండి విడుదల పొందాలి. నీ సాధన యొక్క బలం అక్కడ కనిపించాలి. మన పద్ధతిలో మనం ఉండాలి కాని అనుకరణ పనికిరాదు. మనం ధనవంతులతో స్నేహం చేస్తాము అనుకోండి, వారి ధనం మనకు రాదు, వారి అలవాట్లు మనకు వస్తాయి అనుకోండి మన దగ్గర ఉన్న పది రూపాయలు పోతాయి, చివరకు పాడైపోతాము. మీకు ఎవరైనా ఏదైనా చెపుతూ ఉన్నా, ఆ మాటలు మీరు వింటూ ఉన్నా, వారు ఎంతవరకు మీ క్షేమం కోరి చెపుతున్నారో అది జాగ్రత్తగా మీరు చూసుకోవాలి. పెద్ద పెద్ద కోరికలు మాట వదిలివేయండి, ప్రపంచానికి సంబంధించిన ఏ రకమైన చిన్న కోరిక ఉన్నా మనకు దేహం వచ్చి తీరుతుంది.

మనం మాట్లాడేమాట, చేతితో చేసే పని నిండుగా ఉండాలి, సభ్యతగా ఉండాలి, చేసేది ఏదో అవసరాన్ని బట్టి చెయ్యాలి కాని అక్కడ గొప్పతనం కోసం ఏదీ చేయకూడదు, గొప్పల కోసం చేసామా తిప్పలు తప్పవు. మనం మాటల దగ్గర జాగ్రత్తగా ఉండాలి, చేసే పనుల దగ్గర జాగ్రత్తగా ఉండాలి, ఆలోచనల దగ్గర జాగ్రత్తగా ఉండాలి. ఒక చిన్న పని

కూడా అజాగ్రత్తగా చేయకూడదు. అజాగ్రత్త వలన మనం ప్రమాదంలో పడతాము, దురదృష్టం మనలను వెంటాడుతుంది అనే సంగతి మనకు తెలియాలి. ఎందుచేతనంటే మనం అజాగ్రత్తగా ఉంటే మన మాటలే, మన పనులే, మన ఆలోచనలే మన పునర్జన్మకు కారణాలు అవుతాయి. మనం గమ్యాన్ని దృష్టిలో పెట్టుకొని, చైతన్యాన్ని దృష్టిలో పెట్టుకొని లోకంలో మనకు ఏదైనా కష్టాలు వచ్చినా, నష్టాలు వచ్చినా వాటిని భరించాలి. అవి వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. వాటిని భరించటం నేర్చుకో. మనం ఏదైతే పొందుదాము అనుకొంటున్నామో మన మనస్సు ఆ గమ్యం మీద కనుక ఉంటే ఒకవేళ మనకు ఏదైనా కష్టాలు వచ్చినా, నష్టాలు వచ్చినా అవి చిన్న చిన్న విషయాల కింద మనకు కనిపిస్తాయి. గాంధీగారు అనేవారు నేను రాజకీయ రంగంలో ఉన్నాను, ఈ రాజకీయరంగంలో ఉన్నానని ఏదో దేశానికి ఉపయోగపడుతున్నానని అనుకోవటం లేదు, ఏదో పదవి, గౌరవం ఆశించి మటుకు లేను. ఈ సేవద్వారా, ఈ ప్రేమద్వారా నన్ను నేను పవిత్రం చేసుకోవటానికి ఇదొక మార్గం కింద ఎన్నుకొన్నాను. పవిత్రత లేనప్పుడు ఆత్మజ్ఞానసముపార్జనకు వాడు యోగ్యుడు కాదు. ఆత్మజ్ఞానసముపార్జనకు యోగ్యత రావాలంటే పవిత్రత ఉండాలి, ఏకాగ్రత ఉండాలి, వినయం ఉండాలి. ఇవి సముపార్జించుకోవటానికి దేశసేవను ఒక మార్గంగా ఎన్నుకొన్నాను కాని ఇది నా గమ్యం కాదు, రాముడిలో ఐక్యమవ్వటమే నా గమ్యం అని చెప్పారు.

మనం సేవచేసి వ్యక్తిభావన పెంచుకోకూడదు. సేవవలన వ్యక్తిభావన తగ్గాలి. నువ్వు ఏదైనా మంచిపని చేసినా అది నీ మనస్సు బాగుపడటానికి ఉపయోగపడాలి. పూరిలో ఉన్నవాడు జగన్నాధుడు. వాడు జగత్తుకు నాధుడే కాదు, జగత్తురూపంలో ఉన్నవాడు కూడా ఆయనే. అందుచేత నీవు ఎవరికి ఏది ఇచ్చినా అది జగన్నాధుడికే అందుతుంది, మీరు ఎవరికైనా మంచి చేసారు అనుకోండి, అది జగన్నాధుడికి చేసినట్లే. ఎవరికైనా చెడ్డచేసినా అది జగన్నాధుడికి చేసినట్లే. అక్కడ మనిషి ముఖ్యం కాదు ఎందుచేతనంటే జగత్తురూపంలో ఉన్నవాడు జగన్నాధుడు. ఈ జీవకోటి రూపంలో ఉన్నవాడు, పంచభూతాల రూపంలో ఉన్నవాడు కూడా ఆయనే. ఇక్కడ ఉన్నవాడే అక్కడ ఉన్నాడు, అక్కడ ఉన్నవాడే ఇక్కడ ఉన్నాడు. ఈ లోకానికి, పరలోకానికి బేధం ఏమీ లేదు. అది వేరు, ఇది వేరు అని నీ మనస్సే వేరు చేస్తోంది. మనస్సును తీసి ఒక ప్రక్కన పెట్టు నీకు వేరుభావన పోతుంది. దేహము నేను అనే చిన్న తలంపును పోగొట్టుకొన్నప్పుడు ఈ దేహం ఉండటానికి, దేహం పోవటానికి,

లోకం కనిపించటానికి, లోకం కనిపించకపోవటానికి బేధం పత్తా లేకుండా పోతుంది. నీవు జీవ సేవ చేస్తూ ఉంటే అది ఈశ్వరుడికే అందుతుంది, ఎందుచేతనంటే జీవుడికి ఆధారంగా ఉన్నవాడు ఈశ్వరుడే.

భేదభావన ఉన్నప్పుడు మనం పరమాత్మలో ఐక్యం కాలేము, వేరుగా ఉండటానికి ఇష్టపడతాము. భగవంతుడిలో ఐక్యం అయిపోతే ఇంక అడిగేవాడు ఉండడు. మనం అడగటానికి అలవాటు అయిపోయి భగవంతుడిలో ఐక్యం అవ్వలేకపోతున్నాము. భగవంతుడు అడిగినవాడికి అడిగినదే ఇస్తాడు, అడగని వాడికి అన్నీ ఇచ్చి మోక్షం కూడా ఇస్తాడు. కుచేలుడు కృష్ణుడి దగ్గరకు వెళ్ళి వచ్చిన పని కూడా అడగలేదు, కృష్ణుడి మీద ఉన్న ప్రేమవలన. వాడు ఏ పని మీద వచ్చాడో ఆధ్యాస కూడా పోయింది. అదీ భక్తిభావన. దారిద్ర్యం వలన జీవితంలో అనేక కష్టాలు పడ్డాడు కాని పరమేశ్వరుడిని ఎప్పడూ ఏదీ అడగాలనే తలంపు కూడా రాలేదు, వాడు కుచేలుడు. పుష్పాల మీద ఈగలు వాలతాయి, తేనెటీగలు వాలతాయి. తేనెటీగలు పుష్పాలలో ఉన్న తేనెను లాక్కొనిపోతాయి కాని ఈగలు తేనెను లాక్కోలేవు, ఎంతో కొంత ఆ పుష్పాలను పాడుచేసిపోతాయి. అలాగే అనేకమంది ఈ ప్రపంచంలోనికి వస్తారు కాని కొంతమంది మాత్రమే ఎక్కడ జ్ఞానం ఉందో చూసుకొని దానిని సంపాదించుకొని పొందవలసింది పొంది సైలెంట్‌గా వెళ్ళిపోతారు. కొంతమంది ఈగలుగా ఉంటారు వారు ఉన్నదానిని ఉపయోగించుకోలేరు. మీరు ఈగలుగా ఉండవద్దు, తేనెటీగలుగా ఉండాలి. నువ్వు బ్రహ్మజ్ఞానిని ఆశ్రయించి, వాడిని సేవించి, వాడి ద్వారా జ్ఞానసముపార్జన చేసి తరించు అని పరమాత్మ చెపుతున్నాడు. ఒక భక్తుడు భగవాన్‌తో అంటాడు నీ మీద ప్రేమను నేను చంపుకోలేకపోతున్నాను, నేను ఇక్కడకు వస్తున్నాను. నువ్వు నాతోటి సంతృప్తిగా మాట్లాడటం లేదు, నావంక నిండుగా చూడటం లేదు. అయినా నీ మీద నాకు ప్రేమ ఇసుమంతయు తగ్గటంలేదు అంటాడు. అదే జన్మాంతర అనుబంధం. భగవాన్ అలా చేయటానికి కూడా ఏదో కారణం ఉంటుంది, ఇష్టంలేకపోవటం కాదు. ఇష్టాయిష్టాలకు, రాగద్వేషాలకు అతీతుడే జ్ఞాని. మీకు ఒక అరటిపండు ఇవ్వటం వేరు, మీరు బాగుపడాలని నేను కోరుకోవటం వేరు. మీరు ఒక పేదవాడికి ధనం ఇవ్వవచ్చు, అది మంచిదే. ఆ పేదవాడు మీతోటి సమానం అవ్వటానికి మీరు ఇష్టపడుతున్నారా లేదా అది చూసుకోవాలి. ఎవరో వచ్చి మిమ్మల్ని బాగుచేస్తారని ఎదురుచూడవద్దు. మీకు కాలం ఖర్చు అయిపోతుంది, ఈ లోపు శరీరానికి

చావు వచ్చేస్తుంది. ఎవరో వచ్చి మిమ్మల్ని బాగుపడమని చెప్పేవరకు మీరు బాగుపడటానికి ప్రయత్నం చేయరా? మీకు సొంతబుద్ధి లేదా?

మన మనస్సు కల్పించిన విషయాల నుండి మనం బయటపడకపోతే మన హృదయంలో ఉన్న నిజం మనకు ఎరుకలోనికి రాదు. భగవంతుడు మన హృదయంలో ఉన్నాడు. ఆయన మన మనస్సుకు అందటం లేదు కాబట్టి, మనకు గోచరం కావటం లేదు కాబట్టి ఆయన లేడు అనుకొంటున్నాము. భగవంతుడు ఉన్నాడు, ఆ ఉన్నవాడిని తెలుసుకొనే అర్హత, యోగ్యత మనకు లేదు. ఆ అర్హతను, యోగ్యతను సంపాదించుకోవటమే మన సాధన యొక్క గమ్యం. మీరు లోకానికి సంబంధించిన పనులు కూడా శ్రద్ధగా చేయాలి. ఏకాగ్రత తోటి చేయాలి. నువ్వు మంచిపని చేయాలి. మంచి పనిని శ్రద్ధగా చెయ్యటమే కాదు, దాని యొక్క ఫలితం కూడా నీవు ఆశించకూడదు. అదీ యోగం. ఒకవేళ మీ కోరికతో సంబంధం లేకుండా ఆ ఫలితం వస్తుంది అనుకోండి, అది మిమ్మల్ని బంధించదు. భగవద్గీతలో భగవంతుడు ఎలా చెప్పాడో అలా నడుచుకొంటున్నారు అనుకోండి, అది దైవ సేవ. అలా మీరు నడుచుకొంటూ ఉంటే మీరు దైవాన్ని సేవించినట్లు అవుతుంది, మోక్షాన్ని కూడా పొందుతారు. పుట్టింది నీవు కాదు, చనిపోయేది నీవు కాదు, నీవు కానిదానిని నీవు అనుకొంటున్నావు. నేను పుట్టాను అనుకొనేవాడు ప్రతీవాడు చనిపోతాడు. నేను చనిపోతున్నాను అనుకొనేవాడు ప్రతీవాడు తిరిగి పుడతాడు. ఇలా అనుకొనేవారిని ఎవరిని ప్రకృతి విడిచిపెట్టదు. ఏదైతే పుట్టదో, దేనికైతే చావులేదో అది నువ్వు అయి ఉన్నావు. దాని తాలుక అనుభవం నీకు కలిగేవరకు ఈ చావుపుట్టుకలు తప్పవు. పుట్టేవాడు లేడు, చనిపోయే వాడు లేడు. ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే. అది అన్ని కాలాలలో ఉంది, అంతటా ఉంది. అదే బ్రహ్మం. ఒక కాలంలో ఉండి ఇంకొక కాలంలో లేకపోతే అది నిజం కాదు. ఒక ప్రాంతంలో ఉండి, ఇంకొక ప్రాంతంలో లేకపోతే అది నిజం కాదు.

మనం అందరం ఏమనుకొంటున్నాము అంటే ఇప్పడు ఉన్నాము అనుకొంటున్నాము, శరీరం చనిపోయిన తరువాత మనం ఉండము అనుకొంటున్నాము కదా, దేహము నేను అనే చిన్న తలంపు వలన మనం అలా అనుకొంటున్నాము. దేహము నేను అనుకొనేది చిన్న తలంపు, చిన్న భావన. ఈ తలంపు మీద ఎంత మాయను పెట్టాడో చూడండి. మీరు ఎన్ని సాధనలు చేసినా ఈ తలంపులో నుండి బయటకు రాలేరు అనుకోండి, మాయలో నుండి

కూడా బయట పడలేరు. తినరాని వస్తువు, మన శరీరానికి పడని వస్తువు ఏదైనా తిన్నాము అనుకోండి, ఏదో కొంచమే తిన్నాము కదా అని మనం అనుకొంటాము. కాని అక్కడ నుండి కడుపు నొప్పి ప్రారంభమవుతుంది, ముందు కడుపు ఉబ్బరం, తరువాత వళ్ళు నొప్పులు, తరువాత జ్వరం, తరువాత హాస్పటల్‌కు వెళ్ళటం, ఎంత దూరం వెళ్ళిపోయిందో చూడండి. తినటం కొంచమే తిన్నాము కాని ఎంత దూరం వెళ్ళిపోయిందో. అదేవిధంగా మనం చిన్న పొరపాటు చేసినా, చిన్న చెడ్డ కర్మ చేసినా అది కర్మను పెంచేస్తుంది. ఇది మీరు గుర్తు పెట్టుకోండి. చిన్న చిన్న విషయాలలో అలక్ష్యంగా ఉంటాము అనుకోండి అది నరకానికి తీసుకొనిపోతుంది అంటే మనం ఎంత జాగ్రత్తగా ఉండాలో చూడండి. ప్రతీ చిన్న తలంపుకు కూడా మనం ఏదో రోజున భగవంతుడికి సమాధానం చెప్పాలి. నేను అన్నపూర్ణను ద్వేషిస్తున్నాను అనుకోండి, అన్నపూర్ణ లోపల ఉన్న దేవుడు ఏమనుకొంటాడు అంటే నన్ను ద్వేషిస్తున్నారు నాన్నగారు అని వాడు అనుకొంటాడు, నాకు సమాధానం చెప్ప అంటాడు. నేను అన్నపూర్ణను ద్వేషించాను, నిన్ను ద్వేషించలేదు కదా అంటే మరి అన్నపూర్ణ లోపల నేను ఉన్నాను కదా అని వాడు అంటాడు. అదే కృష్ణుడు అంటాడు ఎవడైతే అందరిలోను నన్నే చూస్తాడో, వాడిలో అందరినీ చూసుకొంటాడో వాడే నిజమైన చూపులు కలవాడు అంటే మిగతావారు అందరూ దొంగ చూపులు కలవారు అని చెప్పటం. ఎవడో చెడ్డవాడు అంటారు, వాడి గొడవ ఎందుకు? వాడిలో నేను ఉన్నాను కదా! నన్ను చూడు అంటున్నాడు పరమాత్మ. ఈశ్వరుడు అంతర్యామిగా లేకుండా ఏ దేహమూ రాదు. నీ దేహం ఏదో రోజున మరణిస్తుంది. ఆ దేహం నీవు కాదు అని నీకు తెలిసినప్పుడు దేహం పోయినప్పుడు నువ్వు పోవని నీకు తెలుస్తుంది. ఇది మీరు అవగాహన చేసుకోండి.

ఒకసారి మీకు సన్మానాలు జరుగుతాయి, ఒకోసారి అవమానాలు జరుగుతాయి. ఇవన్నీ భగవంతుడు కావాలనే చేస్తాడు. ఈ సంఘటనలకు మీ మనస్సు ఎలా ఉందో పరిశీలన చేసుకోవటానికి వాటిని క్రియేట్ చేస్తాడు. ఇవన్నీ శాపాలు అని మీరు అనుకోవద్దు, ఇవన్నీ వరాలు మీకు. మీ మనస్సును బ్రహ్మంలో ఐక్యం అవ్వటానికి సమాయత్తం చేయటానికే ఇవి అన్నీ క్రియేట్ చేస్తాడు. మీకు గౌరవాలు అంటే ఇష్టం అనుకోండి. గురువు ఏమి చేస్తాడు అంటే వాటిని భంగం చేసి, వాటిలో ఉన్న నిస్సారతను మీ బుద్ధికి అర్థమయ్యేలా చేసి, గౌరవాలను గమ్యంగా పెట్టుకొంటే ప్రమాదంలో పడతారు, గౌరవాల వలన మోక్షం రాదు, సత్యాన్ని తెలుసుకొంటే

మీకు మోక్షం వస్తుంది అని మీకు తెలియజేస్తాడు. గురువు మీకు బయట కనబడడు, లోపల నుండి పనిచేసుకొంటూ వస్తాడు. ఒకోసారి మీకు ఆర్థిక ఇబ్బందులు వస్తాయి. ఆర్థిక ఇబ్బందుల వలన మనం నేర్చుకొనే పాఠాలు ఉంటాయి, అవి ఎప్పడూ ఉండవు, వాటిని చూసి కంగారు పడవద్దు. మీ జీవితంలో మీకు ఇష్టమైన సంఘటన ఎదురయినా, ఇష్టంలేని సంఘటనలు ఎదురైనా అవి కొన్ని పాఠాలు నేర్పటానికే వస్తాయి. ఒకోసారి మీకు బాగా ఇష్టమైన వారు మానసికంగా దూరమవుతారు. అంటే వారి మీద మీకు ఎంత మమకారం ఉందో మీకు తెలియజేసి అప్పడు తీసేయటం ప్రారంభిస్తాడు, వాడు గురువు. మీలో ఉన్న అజ్ఞానాన్ని మీకు తెలియజేసి, దాని వలన వచ్చే ప్రమాదాలను మీకు అర్థం అయ్యేలా చేసి గురువు వాటిని తొలగించటం ప్రారంభిస్తాడు. దాని వలన వచ్చే కష్టాలు మీకు తెలిసాయి కాబట్టి అప్పడు మీరు కూడా సహకరిస్తారు, మీకు తొందరగా జ్ఞానం వచ్చేస్తుంది.

జీవితంలో కష్టాలు వస్తూ ఉంటాయి, నష్టాలు వస్తూ ఉంటాయి, లాభాలు వస్తూ ఉంటాయి, సుఖం వస్తూ ఉంటుంది, మీ ముఖాన్ని అటువైపుకు తిప్పవద్దు, మీ ముఖాన్ని మోక్షం వైపుకు తిప్పి ఉంచండి. మీలో చిన్న బలహీనత ఉన్నా, చిన్న వాసన ఉన్నా అది అనేక జన్మలకు కారణం అవ్వవచ్చు. అందువలన మీరు అజాగ్రత్తగా ఉండవద్దు. అన్నింటిలోను జాగ్రత్త అవసరం, సహనం అవసరం. ఈ మధ్యన ఒక ముసలాయనను చూడటానికి వెళ్ళాను. మీరు బాగున్నారా? అని అడిగాను. బాగానే ఉన్నాను, బుద్ధి వచ్చింది అని చెప్పారు. ఏమిటి? అని అడిగితే నారాయణుడు అనేవాడు ఒకడు ఉన్నాడు, కర్మఫలదాత ఒకడు ఉన్నాడు, ఈ సృష్టిని నడిపేవాడు ఆయనే, ఆయనను కాదని మనం చేసేది ఏమీ లేదు అనేటువంటి గుర్తింపు ఇంతకాలానికి 90 ఏళ్ళు వచ్చాక కలిగింది, అందుకే బుద్ధి వచ్చింది అంటున్నాను అని చెప్పారు. మీరు చాలా అదృష్టవంతులు ఇప్పటికయినా మీకు ఆ బుద్ధి కలిగింది, సంతోషించండి, కొంతమందికి ఎంత వయసు వచ్చినా ఆ బుద్ధి కలగదు అని చెప్పాను.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 22-03-06, గుండుగొలను

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనలను రక్షించేది రామాయణం అని పెద్దలు చెపుతారు. ఆంజనేయస్వామి మనస్సు, మనలో ఉన్న బ్రహ్మమే రాముడు అని మహర్షులు చెపుతారు. ఆంజనేయస్వామి

రామచంద్రమూర్తిని ఏవిధంగా అయితే అన్ని కాలాలలో, అన్ని అవస్థలలో అంటిపెట్టుకొని ఉన్నాడో అలాగే మన మనస్సు బ్రహ్మమును అంటిపెట్టుకొని ఉంటే మనం తరిస్తాము అంటున్నారు. వయస్సులో మనకంటే చిన్నవారు అయినా సరే ఎవరైనా మంచిమాట చెపితే మనం వినాలి అని రాముడు ఆంజనేయస్వామికి చెప్పాడు. వయస్సుకు జ్ఞానానికి సంబంధం లేదు. కొంతమందికి నూరు సంవత్సరాలు వచ్చినా శరీరం ముసలిది అవుతుంది కాని లోపల జ్ఞానం ఉండదు. ఆత్మజ్ఞానం లేకుండా ఆత్మసుఖం ఉదయించదు. ఆత్మసుఖం ఒక్కటే నిజమైన సుఖం. అదే స్వతంత్రమైన సుఖం. ఎవడైతే ఆత్మసుఖం పొందాడో వాడికి కూడా లోకం కనిపిస్తుంది కాని లోకంలో ఉన్న ఆకర్షణలకు ఆత్మానుభవం పొందినవాడు ఆకర్షింపబడడు. రావణాసురుడు లోకంచేత మోహింపబడ్డాడు ఎందుచేతనంటే రావణాసురుడులో గుణాలు ఉన్నాయి. రాముడు కూడా లోకాన్ని చూసాడు కాని లోకంచేత మోహింపబడలేదు. ఎందుచేతనంటే రాముడు గుణాతీతుడు. వేదాలలో ప్రతిపాదింపబడిన బ్రహ్మమే రాముడి రూపంలో వచ్చింది అని చెపుతారు. రామాయణంలో మనం నేర్చుకోవలసిన ముఖ్యమైన విషయం క్రమశిక్షణ. జీవితంలో మీరు ఒకటి మర్చిపోకండి. పైపై మెరుగులు చూసి దేనికి ఆకర్షింపబడవద్దు. శరీరము, ధనము, గౌరవాలు, చదువు అన్నీ కూడా మనకు బాహ్యంగా ఉన్నాయి. మనకు బాహ్యంగా ఉన్న విషయాల నుండి మనం ఏదో రోజున విడిపోవాలి. మనం కాని దానిలో నుండి మనం విడిపోవటం తప్పదు. రాముడి దగ్గర నుండి నేర్చుకోవలసింది క్రమశిక్షణ. క్రమశిక్షణ లేకుండా మీకు గౌరవం ఉంది అనుకోండి, ధనం ఉంది అనుకోండి, దాని వలన ఏమీ ప్రయోజనం లేదు. క్రమశిక్షణ లేని చదువు, అధికారం, ధనం మిమ్మల్ని పాడుచేస్తాయి కాని బాగుచేయలేవు. క్రమశిక్షణ లేకపోతే ఆ జీవుడు పతనమవుతాడు.

భక్తిమార్గం, ధ్యానమార్గం, కర్మమార్గం, జ్ఞానమార్గం ఈ మార్గాలు అన్నీ ఎందుకు అంటే మనలో ఉన్న గుణాలను తొలగించుకోవటానికే ఇవన్నీ ఏర్పాటుచేసారు. ఒక విషయం మీరు గుర్తుపెట్టుకోండి. మనం భక్తి మార్గంలో ఉన్నా, కర్మమార్గంలో ఉన్నా, అన్ని మార్గాలను సమన్వయం చేసుకొని ప్రయాణం చేస్తున్నా గుణాలు లేని స్థితిని మనం పొందాలి. మనలో గుణాలు మిగిలి ఉన్నాయి అనుకోండి ఎన్ని సాధనలు చేసినా లోకంచేత ఆకర్షింపబడతాము. మన లోపల గుణాలు ఉన్నాయి అనుకోండి, ఆ గుణాలు మనస్సును బాహ్యముఖానికి తీసుకొని

వచ్చేస్తాయి, దానికి అంతర్దృష్టి రాదు. మనస్సు బాహ్యముఖమయితే సంసారం వచ్చేస్తుంది. సత్పురుషుల సహవాసం, మహాత్ముల సహవాసం మనస్సును అంతర్ముఖం చేయటానికే. అంతఃకరణాన్ని అదుపులో పెట్టుకోకుండా నువ్వు ఆత్మానుభవాన్ని పొందలేవు. అంతఃకరణాన్ని అదుపులో పెట్టుకొనేది ఒక పని కింద కాకపోతే, ఇంక నీకు ఏది పని అంటున్నాడు పరమాత్మ. జీవితంలో నీ దేహం యొక్క ప్రారబ్దాన్ని బట్టి నీకు చదువు వస్తుంది, ధనం వస్తుంది, అధికారం వస్తుంది, అవి ప్రారబ్దానికి సంబంధించిన విషయాలు, అయితే వాటితో మనం ఏకం కాకూడదు. బాహ్యంగా మనకు ఉన్న విషయాలను చూసుకొని క్రమశిక్షణ విడిచిపెట్టకూడదు. క్రమశిక్షణ లేనివాడు ఇహానికి పనికిరాడు, పరానికి పనికిరాడు. మనకు నిజమైన శత్రువు మనలో ఉన్న అజ్ఞానం. అజ్ఞానంలో నుండే దుఃఖం వస్తోంది, అశాంతి వస్తోంది. అందుచేత మనం సాధన చేసి అజ్ఞానంలో నుండి విడుదల పొందాలి. అదే మన జీవిత గమ్యం. అజ్ఞానాన్ని వదిలించుకోవటం చాలా కష్టం. మీకు వేలకోట్లు డబ్బు ఉన్నా, ఆ డబ్బును ఖర్చుపెట్టి మీరు అజ్ఞానంలో నుండి విడుదల పొందలేరు. గురువు అనుగ్రహం లేకుండా మీరు అజ్ఞానంలో నుండి బయటపడలేరు.

పుణ్యాలు, పాపాలు, గౌరవాలు అగౌరవాలు, గొప్పలు తిప్పలు ఇవి అన్నీ మనస్సుకు సంబంధించిన విషయాలు. మనస్సు అనే గెడపదాటితే ఈ ద్వంద్వాలకు అసలు అర్థం లేదు. ఒక్కమాట మీరు గుర్తుపెట్టుకోండి. మన చేతిలో పది రూపాయలు ఉంటే ఎవరికైనా ఒక రూపాయి ఇవ్వగలము, మన చేతిలో పది పళ్ళు ఉంటే ఎవరికైనా ఒక పండు ఇవ్వగలము, మన పేరున పది ఎకరాలు ఉంటే ఎవరికైనా ఒక ఎకరం రాసి ఇవ్వగలము, ఇవన్నీ చేయగలము కాని మనం అజ్ఞానంలో ఉంటూ అజ్ఞానాన్ని విడిచిపెట్టలేము. కారణం ఏమిటి అంటే మన అజ్ఞానం మనకు పంచదారకంటే, తేనెకంటే తియ్యగా ఉంది, ఇంక మనం దానిని ఎలా విడిచిపెట్టగలము. గురువు యొక్క అనుగ్రహం లేకుండా మనం అజ్ఞానంలో నుండి విడుదల పొందలేము. వ్యక్తిభావనను మర్చిపోయి జీవితంలో కనీసం ఒక్క మంచి పని అయినా చేసామా అంటే చేయలేదు. అందుచేతనే మనం అజ్ఞానంలో నుండి బయటకు రాలేకపోతున్నాము. గాఢనిద్రలో మనం ఉన్నాము కాని అక్కడ రూపం గొడవ, నామం గొడవ, ఆస్థుల గొడవ ఏ గొడవ లేదు. అలా జాగ్రదవస్థలో మనం ఉండగలిగితే అజ్ఞానంలో నుండి విడుదల పొందుతాము. గాఢనిద్రలో మనకు వ్యక్తి భావన లేదు, జాగ్రదవస్థలోనికి

వచ్చేటప్పటికి వ్యక్తిభావన వస్తోంది. అక్కడ ఎందుకు లేదు, ఇక్కడ ఎందుకు వస్తోంది అని అలా విచారణ చేసి దానిని పోగొట్టుకొంటేనే హృదయంలో ఉన్న అమృతం మనకు అనుభవంలోనికి వస్తుంది.

రజోగుణాన్ని తగ్గించుకో, తమోగుణాన్ని తగ్గించుకో, సత్వగుణాన్ని పెంచుకో, అదే సాధన. సత్వగుణాన్ని పెంచుకోవాలంటే రత్నత్రయం ఉండాలి. 1. ఆహారం విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి, 2. ఏకాంతవాసం, 3. బ్రహ్మచింతన. మీ జేబులో మూడు రూపాయలు లేకపోయినా ఈ మూడు రత్నాలు మటుకు ఉండాలి. మీ శరీరానికి ఏ వస్తువు అయితే పడదో దానిని వదిలేయాలి. రోజూ గంటో, రెండు గంటలో ఏకాంతవాసం చేయాలి. ఏకాంతంలో ఉన్నప్పుడు మన మనస్సులో ఏమి ఉందో మనకు తెలుస్తుంది. నదులకు గమ్యం సముద్రం. ఈ ఊహలకు, సాధనలకు, మాటలకు, రచనలకు గమ్యం నీ హృదయం, ఏనాటికయినా ఇవి అన్నీ వెళ్ళి హృదయంలో ఐక్యమవ్వాలి. నది వెళ్ళి సముద్రంలో ఐక్యమయ్యేవరకు దానికి రూపబుద్ధి పోదు, నామబుద్ధి పోదు. సముద్రంలో ఐక్యం అయ్యాక దానికి రూపం లేదు, నామం లేదు. అలాగే మనం హృదయంలో ఐక్యం అయినప్పడే మనకు రూపబుద్ధి నశిస్తుంది, నామబుద్ధి నశిస్తుంది. మన సాధనకు గమ్యం హృదయం. మనం తీసుకొనే ఆహారం సాత్వికంగా ఉండాలి, మితంగా ఉండాలి. ఈమధ్య ఒక భక్తురాలు నాతో చెప్పారు ఆవిడకు అనారోగ్యంగా ఉంటే డాక్టరు దగ్గరకు వెళ్ళారట. ఆవిడ మాంసం, చేపలు అవి తినరు. మీ అనారోగ్యానికి చేపలు, మాంసం అవి తినవచ్చు, మంచిది అని డాక్టరుగారు చెప్పారట. ఆవిడ డాక్టరుగారితో ఏమి చెప్పారు అంటే నేను మాంసం, చేపలు తినను. అవి తింటేనే మీకు ఈ రోగం తొందరగా తగ్గిపోతుంది అని మీరు అంటే ఈ రోగం తగ్గవలసిన అవసరం లేదు. ఈ రోగం ఏమి చేస్తుంది శరీరాన్ని చంపేస్తుంది అలాగని జంతువులను బాధపెట్టి మాంసం, చేపలు అవి నేను తినను అని చెప్పారట. కర్మసిద్ధాంతం ఏమి చెపుతుంది అంటే ఏ జంతువులను అయితే మనం తింటున్నామో ఆ జంతువులు తినటానికి మనం ఏదో రోజున వాటికి ఆహారం అవుతాము, అది చట్టం. ఆహారశుద్ధి లేకుండా, బ్రహ్మచింతన లేకుండా అజ్ఞానం నశించదు.

మనిషి పవిత్రుడు అవ్వటానికి ఉపనిషత్‌లలో రెండు మార్గాలు చెప్పారు. 1. విద్య, 2. తపస్సు. విద్య అంటే ఆత్మవిద్య. తపస్సు అంటే మనస్సును ఎండింప చేయటం. ద్వైత

భావన లేకుండా జీవించటం తపస్సు. మనం రెండు నేత్రాలను ఎంత జాగ్రత్తగా కాపాడు కొంటామో అలాగ విద్య, తపస్సు ఈ రెండింటిని కాపాడుకొంటే నువ్వు వ్యక్తిభావనలో నుండి బయటకు వస్తావు, నీకు అమృతానుభవం కలుగుతుంది. మీరు ఏదైనా దుఃఖాన్ని భరిస్తూ ఉన్నా, మీరు బాహ్యంగా ఏవైనా సుఖాలను అనుభవిస్తూ ఉన్నా అది అంతా స్వప్నమే. నాలుగు రోజులకిందట నాకు ఒక స్వప్నం వచ్చింది. నేను అన్నం తింటున్నాను. పెద్ద దుమ్ము వచ్చేసి నేను తినే అన్నంలో పడిపోయింది. స్వప్నంలో నాకు దుఃఖం వచ్చింది. అన్నం రుచిగా ఉంది, శుచిగా ఉంది, ఇప్పుడు అన్నం నేను తినటానికి పనికిరాదే అని నేను దుఃఖపడు తున్నాను. ఆ దుఃఖం ఎంత వేగంగా వచ్చింది అంటే ఆ దుఃఖం నేను భరించలేక మెలుకువ వచ్చేసింది. మెలుకువ వచ్చాక అన్నం అసత్యం, దుమ్ముపడటం అసత్యం, నేను దుఃఖపడటం అసత్యం, ఏమీ లేదే. అన్నం లేదు, దుమ్ము లేదు, ఏడుపు లేదు ఏమీ లేదు, నేను ప్రశాంతంగా ఉన్నాను. ఏమీలేని దానికి ఇంత దుఃఖం వచ్చింది ఏమిటి అని మెలుకువ రాగానే అనుకున్నాను. అలాగే మనం ఇన్ని జన్మల నుండి ఎన్ని దుఃఖాలు పడుతున్నా అమృతానుభవం కలగగానే అయ్యో ఏమీ లేదే, ఏమీ లేనిదానికి ఇంత అశాంతి తెచ్చుకొన్నాము అని మనకు అనిపిస్తుంది. రామశాస్త్రి అనే భక్తుడు భగవాన్ దగ్గరకు వచ్చి నన్ను ఎలా జీవించమంటారు అని అడిగాడు. భగవాన్ ఏమన్నారు అంటే నీ పేరు రామశాస్త్రి. రాముడు ఎలా జీవించాడో అలా జీవించు, ఇప్పుడు నీ శరీరంతో నువ్వు ఎలా ఏకంగా ఉంటున్నావో అలాగ రాముడితో ఏకంగా ఉండు. రాముడిలో ఐక్యమవుతావు, పొందవలసింది పొందుతావు అని చెప్పారు.

ఎవడు ధన్యజీవి అంటే ఇప్పుడు మనకు శరీరం వచ్చింది, మరల శరీరం తిరిగి రాకుండా ఎవడైతే చూసుకొంటాడో వాడే అదృష్టవంతుడు, వాడే ధన్యజీవి. సూర్యుడికి చీకటి ఎలా ఉంటుందో తెలియదు, లోపల ఉన్న బ్రహ్మంకు పుట్టుక ఎలా ఉంటుందో, చావు ఎలా ఉంటుందో తెలియదు. లోపల ఉన్న బ్రహ్మంకు శరీరంతో పనిలేదు, జీవుడికి శరీరం కావాలి. జీవుడిలో గుణాలు ఉంటాయి, ఆ గుణాలు వ్యక్తమవ్వటానికి శరీరం వస్తుంది, ఆ శరీరం ద్వారా గుణాలు వ్యక్తమవుతాయి. గుణాలు లేనివాడికి శరీరం రాదు ఎందుచేతనంటే శరీరం ద్వారా వ్యక్తమవ్వవలసింది అక్కడ ఏమీ లేదు. అందుచేత నువ్వు గుణాతీతుడవు అవ్వటానికి ప్రయత్నం చెయ్యి అని పరమాత్మ చెపుతున్నాడు.

మాకు దేవుడి గురించి నాలుగు మాటలు చెపుతారా అని భగవాన్‌ను అడిగారు.

దేవుడు నీకు పరాయివాడు. ఆత్మ నీ హృదయంలో ఉంది. అది నీవై ఉన్నావు. నీ హృదయంలో ఉన్న చావులేని సత్యదార్థము గురించి అడగకుండా పరాయివాడు అయిన దేవుడి గురించి అడుగుతావు ఏమిటి? నీ దేహం కూడా పరాయిదే. నీ హృదయంలో ఉన్న సత్యం తప్పించి మిగతావి అన్నీ పరాయి విషయాలే. నీ గురించి నీవు అడగటం మానివేసి పరాయి విషయాలు అడుగుతావు ఏమిటి. నీ దేహం కూడా పరాయిది కాబట్టి నిన్ను విడిచిపెట్టి బయటకుపోతుంది పుణ్యాలు, పాపాలు, గౌరవాలు, అధికారాలు ఇవి అన్నీ పరాయి విషయాలే. నువ్వు ఏదిగా ఉన్నావో దాని గురించి అడగటం వదిలేసి పరాయి విషయాలు ఎందుకు అడుగుతున్నావు. దాని గురించి అడగాలనే బుద్ధి నీకు ఎందుకు కలగటం లేదు. గురువు అనుగ్రహం లేకుండా నిన్ను నీవు తెలుసుకోవాలనే బుద్ధి నీకు కలుగదు. ఫెయిల్ అవుతామా, సక్సెస్ అవుతామా అనే మాట వదిలివేయండి, ఈశ్వరుని దయ లేకుండా అమృతానుభవం పొందాలనే తలంపు కూడా నీకు రాదు.

ప్రజలను ఉద్ధరిస్తాము అని చెప్పేవారు చాలామంది ఉన్నారు, ప్రజల కోసం అనేక మంది పనిచేస్తారు కాని వారు ప్రజల దుఃఖాన్ని ఎందుకు ఆర్పలేకపోతున్నారు అని అడుగుతున్నారు. భగవాన్ ఏమిచెపుతున్నారు అంటే ఎవడైతే ప్రజలను ఉద్ధరిస్తాను అని అంటున్నాడో వాడే అహంకారంతో ఉన్నప్పుడు వాడు నిన్ను ఏమి ఉద్ధరిస్తాడు. కొంతమంది నాయకులు మీకు సేవ చేయవచ్చు. వారు చేసే సేవ నిజం అయినా, నిజంకాకపోయినా వారు నాయకులు అవుతున్నారు. నిజంగా మీరు బాగుపడాలని వారు సేవ చేస్తే మీకు దుఃఖం నశిస్తుంది. కాని వారు బాహ్యంగా ఏదో ఆశించి పనిచేయటం వలన వారు నాయకులు అవ్వవచ్చు కాని మీ దుఃఖాన్ని ఎలా ఆర్పగలరు, అది సాధ్యం కానేకాదు. లోపల స్వార్థం పెట్టుకొని ఓట్ల కోసం, గౌరవాల కోసం పని చేయవచ్చు, ఆ స్వార్థం వాడికి నెరవేరవచ్చు. స్వార్థాన్ని కేంద్రంగా పెట్టుకొని జీవించేవాడు మీ దుఃఖాన్ని ఆర్పలేడు. ఎవడైతే అమృతానుభవం పొందాడో, లోపల హృదయంలో ఉన్న సద్వస్తువుతో ఎవడైతే ఏకంగా ఉన్నాడో వాడు నీ అజ్ఞానాన్ని హరింపజేయగలడు, నీ అశాంతిని పోగొట్టగలడు. నా మాయను ఎవడూ జయించ లేడు అని గీతలో పరమాత్మ చెప్పాడు. మాయ ఎలా ఉంటుంది అంటే నేను చాలా మంది మంచి వారిని చూసాను. వారు కొంతకాలం నిజంగా సేవ చేస్తారు. అలా పది సంవత్సరాలు సేవ చేసిన తరువాత ఏదో పదవి లేకుండా ఉంటే ఎలాగ? ఏదో పదవి వస్తే బాగుంటుంది, పది మంది కూడా ఉంటారు

అనిపిస్తుంది, అంటే మాయ అలా అనిపింపచేస్తుంది. మాయను అతిక్రమించటం కష్టం. ఈశ్వరానుగ్రహం లేకుండా ఈ మాయలో నుండి ఎవడూ బయటకు రాలేడు.

తన యోగ క్షేమముల గురించి ఎవడైతే నిరంతరం ఆలోచించుకొంటున్నాడో వాడి మనస్సు అంతర్ముఖం అయ్యే ప్రశ్న లేదు, వాడు ఎన్ని పుణ్యకార్యక్రమాలు చేసిన వాడి మనస్సు అంతర్ముఖం అవ్వదు, ఇలా కోటిజన్మలు ఎత్తినా అజ్ఞానంలో నుండి బయటకు రాలేవు, అజ్ఞానంలో నుండి బయటకు రాకపోతే మోక్షసుఖం నీకు అందదు. మోక్షసుఖం నీ చేతికి అందాలంటే కోటి జన్మలు ఎత్తిన తరువాత అయినా నీవు అజ్ఞానంలో నుండి బయటకు రావాలి కదా అటువంటప్పుడు అజ్ఞానంలో నుండి బయటకు రావటానికి ఈ జన్మలోనే ఎందుకు ప్రయత్నం చేసుకోకూడదు. కొంతమంది సాధన చేసుకోవటానికి రేపు రేపు అంటారు, రేపుకు రూపు లేదు, ఏ రోజు పని ఆ రోజు చేసుకొంటే అసలు చెయ్యటానికి ఇంక పని మిగలదు, సాధన కూడా అంతే. చేతిలో ఉన్న పని చేసుకోవటం మానేసి రేపు రేపు అంటే యింక ఆ పని ముగియదు. ఏ రోజు చేసుకొనేది ఆ రోజు చేయాలి. ఒక ప్రక్కన వాసనాక్షయం కోసం ప్రయత్నం చేయాలి, యింకో ప్రక్కన ఆత్మవిద్యను సముపార్జించాలి. మన సాధన ఏదో మనం చేస్తున్నప్పటికీ ఈశ్వరుని దయ లేకుండా లోపల ఉన్న వస్తువును మనం పొందలేము. అందుచేత నీలోపల ఏమి జరుగుతోందో చూడటం నేర్చుకో.

ఒక ప్లీడరుగారు భగవాన్ దగ్గరకు వచ్చి లోకంలో చాలా గొడవలు ఉన్నాయి, అశాంతి ఉంది, లోకంలో మనుషులు ఎప్పుడూ సమానంగా లేరు అంటున్నారు. మనుషులు అందరూ సమానంగా ఉండరు, సమానంగా ఉండటానికి అవకాశం లేదు, అది ప్రకృతి. ఒక తండ్రికి పదిమంది పిల్లలు ఉన్నారు అనుకోండి, ఆ పదిమంది పిల్లలకు ఆస్థి సమానంగా పంచి పెట్టాడు అనుకోండి, వారు సమానంగా ఉండరు, అందులో ఒకడు బాగుపడవచ్చు, ఒకడు పాడైపోవచ్చు, దీనికి ఆ తండ్రి కర్త కాదు. ప్రపంచం అంటేనే అసత్యం. అసత్యం ఎప్పడూ సమానంగా ఉండదు. ఇప్పడుగాని, రాబోయే యుగాలలోకాని మనుషులను ఎవరూ సమానం చేయలేరు. లోకం అంటే కుక్కతోక లాంటిది. కుక్కతోక వంకరను ఎవడూ తీయలేడు. భగవాన్ ఏమి చెప్పారు అంటే ఈ లోకంలో గొడవలు అన్నీ ఎవరు చూస్తున్నారు అని అడిగారు. నేనే చూస్తున్నాను అన్నాడు. నువ్వు ఉంటే ఈ లోకంలో గొడవలు కనిపిస్తున్నాయా, నువ్వు లేకుండా ఇవన్నీ కనిపిస్తున్నాయా అన్నారు. నేను ఉంటేనే ఇవన్నీ

కనిపిస్తున్నాయి అన్నాడు. ఇవన్నీ చూసే ఆ నేను ఎవడో తెలుసుకోవయ్యా అప్పుడు తెలుస్తుంది నీకు ఈ సృష్టి రహస్యం, అప్పటిదాకా తెలియదు అన్నారు.

ఇది మీరు బాగా గుర్తుపెట్టుకోండి. కేవలం అన్నంతినటం కోసం, బట్టలు కట్టుకోవటం కోసం మనం ఈ భూమి మీదకు రాలేదు. తినటానికి అన్నం ఉన్నవారు, కట్టుకోవటానికి బట్టలు ఉన్నవారు సుఖంగా లేరు, శాంతిగా లేరు, కేవలం దానికోసం మనం ఈ భూమి మీదకు రాలేదు. కొన్ని పాఠాలు నేర్చుకోవటానికి ఈ శరీరం భూమి మీదకు వచ్చింది. ఆ పాఠాలు నేర్చుకొనేవరకు ముక్కులో గాలి తిరుగుతుంది, తరువాత ముక్కులో గాలి ఆగిపోతుంది. ఈ శవంలోనికి గాలి ఎప్పుడు వచ్చిందో మనకు తెలియదు, ఈ శవంలో నుండి గాలి ఎప్పుడు బయటకు పోతుందో తెలియదు, ఈ రెండింటికి మధ్యన ఈ శవాన్ని మనం అటు ఇటు తిప్పతున్నాము. ఈ శరీరం ద్వారా మనం కొన్ని పాఠాలు నేర్చుకోవాలి. ఒకోసారి మనకు అదృష్టం ఎదురువస్తుంది, ఒకోసారి దురదృష్టం ఎదురువస్తుంది. అనేక కష్టాలు వస్తాయి, సుఖాలు వస్తాయి, లాభాలు వస్తాయి, నష్టాలు వస్తాయి. ఇవన్నీ ద్వంద్వాలు. ఈ ద్వంద్వాల మధ్యన ఉంటూ అందులోనుండి పాఠాలు నేర్చుకొని ఈ ద్వంద్వాలనుండి ఎవడైతే విడుదల పొందుతాడో వాడే జీవన్ముక్తుడు. మనకు ఏదైనా కోరిక ఉంది అనుకోండి ఆ కోరిక నెరవేర్చుకోవటానికి ఆ వేగం ముందు ఎన్ని పొరపాట్లు అయినా చేసేస్తాము. కొంత మందికి కోపం చాలా వేగంగా వస్తుంది, అప్పుడు ఏమి చేస్తున్నారో వారికి తెలియదు, చేతిలో ఏదైనా ఉంటే విసిరేస్తారు. కోరిక యొక్క వేగం, కోపం యొక్క వేగం, భయం యొక్క వేగం వీటిలోనుండి విడుదల పొందేవరకు నువ్వు ద్వైతభావనలో నుండి బయటకు రాలేవు. ఆంజనేయస్వామికి మించిన సేవకుడు లేడు, ఆంజనేయస్వామికి మించిన భక్తుడు లేడు, ఆంజనేయస్వామికి మించిన పండితుడు లేడు. అసలు తనకు సొంత పని అంటూ లేకుండా దేవుడు పనే తన సొంతపనిగా చేసిన వాడు ఆంజనేయస్వామి. సేవకులలోగాని, మనం నమ్మదగినవారు అనుకున్న వారిలోకాని ఆంజనేయస్వామితో పోల్చదగినవాడు ఈ సృష్టిలో ఎవడూ లేడు. ఆంజనేయస్వామి జన్మ, ఆయన ప్రవర్తన కనీసం మనం అర్థం చేసుకొన్నా మనకున్న పనులు అన్నీ పూర్తి అయిపోతాయి, మనకు మోక్షం వస్తుంది.

భగవంతుడు ఎప్పుడు ఎవరికి ఏది ఎలా ఇవ్వాలో ఆయనే చేస్తాడు, అది ఈశ్వరుడు చూసుకొంటాడు. ఈ మధ్యన ఎవరో నా దగ్గర అన్నారు ఏమండీ నాన్నగారు! భగవంతుడు

గులాబీ పువ్వంతా ఒకడికి ఇవ్వటం లేదు, అలా ఇస్తే పోనీ పువ్వుతోపాటు ముళ్ళు ఉంటాయి. గులాబీ పువ్వులో ఉన్న పువ్వులు ఒకరికి ఇస్తే, ముళ్ళు ఇంకొకరికి ఇస్తున్నాడు ఏమిటి అన్నారు. నేను ఏమి చెప్పాను అంటే పువ్వుల వలన వాడు నేర్చుకొనేది ఉంది, ముళ్ళ వలన వీడు నేర్చుకొనేది ఉంది. వాడికి పువ్వులు ఎందుకు ఇచ్చాడో మనకు తెలియదు, వీడికి ముళ్ళు ఎందుకు ఇచ్చాడో మనకు తెలియదు. కొంతమందికి జీవితం పొడుగునా కష్టాలు ఎక్కువగా ఉంటాయి. రాముడి జీవితం పొడుగునా కష్టాలే. మానవ జీవితం వచ్చాక ఎన్ని కష్టాలు వస్తాయో, ఎన్ని బాధలు వస్తాయో అన్నీ సీతారాములు మనకోసం అనుభవించి చూపించారు, అదే సీతారాముల కథ. అందుచేత భగవంతుడు చెప్పిన మాటలు వింటే మనం బాగుపడతాము, వినకపోతే పతనమవుతాము. మనం భగవంతుడి మీద గౌరవం పెంచుకోవాలి. భగవాన్ చెప్పిన ఈ సిద్ధాంతం మీరు బాగా అర్థం చేసుకోండి. నీకు గాఢ నిద్రలో అహంభావన లేదు, గాఢనిద్రలో పరిమితులు లేవు, అదృష్టం, దురదృష్టం, గౌరవం, అగౌరవం ఇవన్నీ గాఢనిద్రలో ఏమీలేవు. కాని గాఢనిద్రలో నీవు ఉన్నావు, అక్కడ నీకు దేనితోను తాదాత్మ్యం లేదు, అక్కడ సుఖంగా ఉన్నావు, శాంతిగా ఉన్నావు. గాఢనిద్రలో నీవు ఎలా ఉన్నావో, జాగ్రదవస్థలో కూడా నువ్వు అలాగ ఉండగలిగితే అప్పుడు భగవంతుడు నిన్ను ఆత్మజ్ఞానంతో అలంకరిస్తాడు, అది నీ కడసారి జన్మ.

మీ చేతిలో పనిని శ్రద్ధగా చేయండి, నేను చేస్తున్నాను అనే భావన లేకుండా చేయండి, మీకు ఆ పని పూర్తి అయిపోయింది, చిత్తశుద్ధి కలుగుతుంది, చిత్తశుద్ధి అనే గేటు ద్వారా మీరు మోక్షంలో ప్రవేశించవచ్చు. దుఃఖ కారణాలు ఉన్నా మీరు లోపల సుఖంగా ఉండగలుగుతున్నారు అనుకోండి, అశాంతికి కారణాలు ఉన్నా మీరు లోపల శాంతిగా ఉంటున్నారు అనుకోండి మిమ్మల్ని చూసి ఈశ్వరుడు పొంగిపోయి మీలో ఉన్న అజ్ఞానాన్ని తాను తీసుకొని తన జ్ఞానాన్ని మీకు ఇస్తాడు. వాడే ఈశ్వరుడు. అప్పుడు నీకు హద్దులు లేవు, పరిమితులు లేవు. అప్పుడు నీవు ఈశ్వరుడి చేతిలో పనిముట్టు కింద ఉంటావు. అప్పుడు నీ యోగక్షేమాలను నీవు చూసుకోనక్కరలేదు, ఆయనే చూస్తాడు. ఈశ్వరుడు దయాస్వరూపుడు అంటున్నారు, ఆయన దయ నాకు ఎలా కలుగుతుంది అని రమణస్వామిని ఒకరు అడిగారు. ఈశ్వరుడి పట్ల నువ్వు శరణాగతి చెందు, ఆయన దయ నీకు కలుగుతుంది అని చెప్పారు. శరణాగతి వలన దుఃఖం నశిస్తుంది, మీ హృదయంలో ఉన్న సుఖం మీకు

స్వరూపంగా వ్యక్తమవుతుంది. మనకు ఉన్న ఆకలిని తగ్గించుకోవటానికి, మన శరీరాన్ని నిలబెట్టుకోవటానికి మనం అన్నం తింటున్నాము. ఆకలిని తగ్గించుకోవటానికి అన్నం ఎలా తింటున్నామో, రోగం తగ్గించుకోవటానికి మందులు ఎలా వేసుకొంటున్నామో, అలాగే మనలో ఉన్న గుణాలను తగ్గించుకోవటానికే భక్తి. ఈ విషయం తెలుసుకొన్నవారు ధన్యులు. మనలో ఉన్న గుణాల నుండి బయటకు రాలేము అనుకోండి, మనస్సు బాహ్యముఖానికి వెళ్ళటం మానదు, మనకు పునర్జన్మలు తప్పవు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 26-03-06, పత్రేపురం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

కర్మ చేస్తే దేహం వస్తుంది, దేహం వస్తే దుఃఖం వస్తుంది, దేహం వచ్చాక దుఃఖం లేకుండా ఎవడూ ఉండలేడు. ఈ దుఃఖం నశించటానికి పది మందులు లేవు, ఒక్కటే మందు అదే ఆత్మజ్ఞానం. ఆత్మజ్ఞానం పొందేవరకు దుఃఖం నశించదు. మన హృదయంలో ఉన్న బ్రహ్మంలో ఐక్యమయ్యేవరకు దుఃఖం నశించదు. చనిపోవటం, పుట్టటం అంటే ఏమీ లేదు ఒక బుడగలో నుండి ఇంకొక బుడగలోనికి వెళ్ళటం. శరీరం ఒక బుడగ, ఈ బుడగ పగిలిపోతుంది, ఇంకో బుడగ వస్తుంది, మరల ఆ బుడగ పగిలిపోతుంది, ఇంకొక శరీరం వస్తుంది. ఈ శరీరాలన్నీ బుడగలు. మనం ఏదైనా మాట మాట్లాడిన, చేతితో ఒక పని చేసిన ప్రేమభావనతో చేయాలి, యజ్ఞభావనతో చేయాలి. మనం యజ్ఞభావనతో పనిచేస్తూ ఉంటే మనం పవిత్రులమవుతాము. మనకు తలంపు ఉంటే వస్తుంది లేకపోతే అది రాదు అని మనం అనుకొంటాము. మన దేహప్రారబ్ధాన్ని బట్టి వచ్చేది వస్తుంది, అది మన తలంపుతో సంబంధం లేకుండానే వస్తుంది. మీరు శ్రద్ధగా ఈ ప్రవచనాలు వింటూ ఉంటే మీకు వివేకం పెరుగుతుంది, మీ కాళ్ళ మీద మీరు నిలబడ గలుగుతారు. ప్రతీ మనిషికి ఎంతోకొంత సొంతబుద్ధి ఉండాలి. మీకు సొంతబుద్ధి పెరగాలంటే జ్ఞానం తాలుక మాటలు శ్రవణం చేయాలి. మనబుద్ధిలో ఉన్న దోషాలు, పాపాలు పోవాలంటే తపస్సు చేయాలి. భగవంతుడు చెప్పిన మాటలను అనుసరించి జీవించటం తపస్సు. కొంతమంది కష్టాలు వస్తే ఎంతో సహనంగా వాటిని భరిస్తారు, అది కూడా తపస్సే.

మీరు ఎవరినీ భయపెట్టవద్దు, ఇతరులను చూసి మీరు భయపడవద్దు. మీరు

ఇతరులను విమర్శించవద్దు, ఇతరులు ఎవరైనా విమర్శిస్తూ ఉంటే మీరు కంగారు పడవద్దు. మీరు విమర్శించటం మొదలుపెడితే అహంకారం పెరిగిపోతుంది, అందుచేత సహనం చాలా ముఖ్యం. మీకు ఎన్ని కోట్లు డబ్బు ఉన్నా, ఆత్మజ్ఞానం లేకపోతే దుఃఖం నశించదు. మీకు లోపల అశాంతిగా ఉంది అనుకోండి, లోపల కుళ్ళిపోతున్నారు అనుకోండి మీకు ఉన్న డబ్బు, అధికారం, గౌరవం ఏమి చేస్తుంది. మీకు అందరకు ఆత్మజ్ఞానం కలగాలి, మీరు అందరూ సుఖస్వరూపులు అవ్వాలి, ఈ ప్రవచనాల యొక్క ప్రయోజనం అదే. ఆత్మజ్ఞానం పొందటం చాలా కష్టం అని చాలామంది అనుకొంటారు. మీరు ఈ సబ్జక్టును శ్రద్ధగా వినండి. ఆ ప్రకారం జీవించండి, మీకు అందరికీ ఆత్మజ్ఞానం కలుగుతుంది. ఈ శరీరం ఉండగానే ముక్తిని పొందినవాడు స్వర్గలోకం, నరకలోకం లోనికి వెళ్ళనక్కరలేదు. అంతటా నిండి ఉంటాడు, సుఖంగా, శాంతిగా ఉంటాడు. శరీరం మరణించక ముందు ఆత్మజ్ఞానం పొందలేదు అనుకోండి ఏదో లోకంలోనికి వెళ్ళిపోతాము. ఆ లోకంలో కొంతకాలం ఉంటాము మరల ఈ శరీరం అనే బుడగను కాల్చేస్తారు, మరల కొత్తబుడగ అంటే కొత్త శరీరం వస్తుంది.

గాఢనిద్రలో మనకు కర్తృత్వం లేదు. డబ్బు సంపాదించినవాడు గాఢనిద్రలో నేను డబ్బు సంపాదించాను అనుకోడు, పండితుడు కూడా నేను పండితుడిని అని గాఢనిద్రలో అనుకోడు. అలా జాగ్రదవస్థలో ఉండగలిగినప్పడు మీకు జ్ఞానం కలుగుతుంది. గాఢనిద్రలో మీకు కర్తృత్వం లేదు, జాగ్రదవస్థలోనికి రాగానే అది వచ్చేస్తుంది. అది ఎలా వస్తోందో చూసుకొని, దానిని తొలగించుకొనేవరకు మనకు జ్ఞానం కలుగదు. మీ సంసారం గురించి మీరు అనేక కష్టాలు పడుతున్నారు, మీ బాధ్యతలు జాగ్రత్తగా చూసుకొంటున్నారు. వ్యవసాయ దారులంతా నీరు ఎప్పడు పెట్టాలి, కోత ఎప్పడు కోసుకోవాలి, ఎటువంటి పంటలు పండించాలి అని చూసుకొంటూ ఉంటారు. అంత శ్రద్ధ మీకు జ్ఞానం మీద ఉంటే మీకు జ్ఞానం కలుగుతుంది. జ్ఞానం సంపాదించటానికి ఇల్లు విడిచిపెట్టి పారిపోవాలేమో, కుటీరం కట్టుకొని తలుపులు వేసుకొని జపం చేసుకోవాలేమో అని చాలామంది అనుకొంటూ ఉంటారు. అలా ఎక్కడికో పారిపోతే జ్ఞానంరాదు, అజ్ఞానం పెరుగుతుంది. భగవాన్ అన్నారు నువ్వు ఇంటి దగ్గర ఉండి టైముకు కాఫీ తాగి, భోజనం చేసి నీడ పట్టున ఉండి సాధన చేయలేనప్పడు ఎక్కడికో పారిపోయి నీవు సాధించేది ఏమిటి? నువ్వు ఎక్కడికి పారిపోయినా నీకూడా మనస్సు ఉంటుంది. మనస్సును బాగుచేసుకొనే విధానం చూసుకో. అహంకారం విడిచి

పెట్టకపోతే మనిషికి ఎన్ని ఉన్నా వాడికి సుఖం లేదు. భగవాన్ అంటారు అహంకారం ఉంటే నువ్వు ఉన్నావు, నేను ఉన్నాను, దేవుడు ఉన్నాడు, పుణ్యం ఉంది, పాపం ఉంది, స్వర్గం ఉంది, నరకం ఉంది, అది లేకపోతే ఏదీ లేదు. అహంకారం లేనివాడు కర్మ చేసిన అది వాడిని అంటదు, అహంకారంతో చేసిన కర్మ వాడిని చుట్టుకొంటుంది. కర్మను బట్టి జన్మ వస్తుంది, జన్మను బట్టి దుఃఖం వస్తుంది. ఆ దుఃఖం ఆత్మజ్ఞానం వలననే నశిస్తుంది. అనుకొనేవాడు జీవుడు, ఏమీ అనుకోనివాడు దేవుడు. కొంతమందికి ఎదుటివారిచేత పొగిడించుకోవాలని ఉంటుంది. అది ఒకరకమైన వాసన. అది చాలా ప్రమాదం, అది అనేక జన్మలకు కారణం అవుతుంది, అది వారికి తెలియటంలేదు.

మీ సొంతపని మీరు ఎంత శ్రద్ధగా చేసుకొంటారో, ఆంజనేయస్వామి ఇతరుల పని కూడా అంత శ్రద్ధగా చేస్తారు, అందుకే ఆయన మహాత్ముడు అయ్యాడు, మనం గుడులు కట్టించి పూజిస్తున్నాము. మీరందరు చెడ్డవారు అని నేను అంటాను అనుకోండి నాకు ఏమీ మంచితనం రాదు, ఇంతకు ముందు నాకు ఏదైనా గౌరవం ఉంటే అదిపోతుంది. ఇవన్నీ మనం జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. భగవంతుడు మనకు ఈ శరీరం ఎలా ఇచ్చాడో అలాగే బుద్ధిని కూడా ఇచ్చాడు. మనం బుద్ధిని ఉపయోగించుకోవాలి. మనకు సొంతబుద్ధి ఉండాలి. సబ్జక్టు బాగా అర్థం చేసుకోవాలి. సమాజంలో రకరకాల మనుషులు ఉంటారు. అందరూ మంచివారు అని చెప్పలేము అలాగని చెడ్డవారని చెప్పలేము. మంచివారితో స్నేహం విడిచిపెట్టకూడదు. మీకు డబ్బు ఉంటే మంచిదే, దానితో ఏవైనా మంచి పనులు చేయండి, అప్పడు మీ మనస్సు బాగుపడుతుంది. మంచిపనులు చేయటం వలననే జ్ఞానం వచ్చేయదు. నీ హృదయంలో ఉన్న వస్తువును తెలుసుకొంటే నీకు జ్ఞానం కలుగుతుంది. ఒక పండితుడు నా దగ్గరకు వచ్చాడు. నేను ఆయనతో మీరు బాగా చదువుకొన్నారు, పాండిత్యం ఉంది అన్నాను. నాకు పాండిత్యం ఉన్న మాట నిజమే, ఆ పాండిత్యమే నేను జ్ఞానం అనుకొంటున్నాను, నా అహంకారానికి మేత కంటిన్యూ అయిపోతోంది, నాకు అహంకారం ఇంకా పోలేదు. ఈ అహంకారం ఎక్కడముగుస్తుందో నాకు తెలియటంలేదు అన్నారు.

సాధనలో మీకు ఇష్టమైన గురువును ఆరాధించుకోండి, మీకు ఇష్టమైన దేవుడిని పూజించుకోండి. భక్తిమార్గం, జ్ఞానమార్గం, కర్మమార్గం, ధ్యానమార్గం మీకు ఇష్టమైనమార్గంలో ప్రయాణం చేయండి కాని ఒక్క మాట గుర్తు పెట్టుకోండి. దేహాభిమానం తగ్గకుండా మీకు

ఆత్మజ్ఞానం కలుగదు. రోగం వస్తే మందు వాడతాము. మందువాడుతూ ఆరోగం తగ్గుతోందో లేదో చేసుకొంటాము. అలాగే మీరు ఏ సాధన చేసినా దానివలన మీ దేహాభిమానం తగ్గుతోందా లేదా అని జాగ్రత్తగా చూసుకోవాలి, దేహాభిమానం తగ్గటంలేదు అనుకోండి ఎన్ని సాధనలు చేసినా ఏమీ ప్రయోజనం లేదు. మనం చేసే పొరపాటు ఎక్కడ ఉంది అంటే ఎంతసేపు ఈ అహంకారాన్ని ఎలా పొడిగించుకొందామా అని చూస్తున్నాము కాని తగ్గించుకోవటానికి ప్రయత్నం చేయటం లేదు. అహంకారాన్ని పొడిగించుకొనేకొలది జన్మలు పెరిగిపోతాయి, దుఃఖం పెరిగిపోతుంది. జ్ఞాని ఈ లోకాన్ని చూస్తాడు కాని ఆ లోకం వాడిని బంధించదు. అజ్ఞాని ఈ లోకాన్ని చూస్తాడు కాని ఈ లోకం వాడిని బంధిస్తుంది. రూపమును పట్టుకొని పుట్టును, రూపమును పట్టుకొని పెరుగును, రూపమును పట్టుకొని ఏడుస్తూ ప్రాణం విడిచిపెట్టును, రూపంలోని ఈ అహంకార పిశాచము అన్నారు భగవాన్. చిన్నప్పుడు ఆటపాటలతో కాలక్షేపం అయిపోతుంది, వయస్సు వచ్చాక కోరికలతోటి కాలక్షేపం అయిపోతుంది, ముసలితనం వచ్చాక వారు పలకరించటం లేదు, ఎవరూ నన్ను గుర్తించటం లేదు అని ఏడుస్తూ చస్తాడు, అదే మనం చేసే పని. మనకు నేను అనే తలంపు ఒకటి ఉంది. ఇది మొదటి తలంపు. దాని మీదే సృష్టి అంతా ఆధారపడి ఉంది. పేకముక్కలతో కోట కట్టారు అనుకోండి. దానిని పడగొట్టటానికి గెడ్డపారలు అక్కరలేదు, ఊరికే గట్టిగా ఊదితే అది పడిపోతుంది. అలాగే నీవు విచారణ చేస్తే దేహము నేను అనే తలంపు కూడా ఊడిపోతుంది అన్నారు భగవాన్.

పనిచేసేటప్పుడు సరిగా చెయ్యరు, అహంకారం వారిని సరిగా చెయ్యనివ్వదు. మనం సరిగా పని చెయ్యలేదు ఫలితం రావటం లేదు అనుకోరు. లోపల శాంతి ఉన్నవాడు, లోపల ప్రేమభావం ఉన్నవాడు ఫలితం అనుకూలంగా వచ్చినా, ప్రతికూలంగా వచ్చినా పట్టించుకోడు అని పరమాత్మ చెపుతున్నాడు. మనకు సంతృప్తి లేక లోపల శాంతి లేక ఫలితం కోసం ఎదురుచూస్తూ ఉంటాము. కర్మ ఫలితాన్ని రోజూ ఎవడైతే మననం చేస్తున్నాడో అది వాడిని చుట్టుకొంటుంది, అదే పునర్జన్మలకు కారణం అవుతుంది. వ్యక్తిభావన లేనివాడు పనిచేసినా చెయ్యనివాడితో సమానము. భగవాన్ శరీరం విడిచి పెట్టేటప్పుడు అక్కడ ఉన్నవారు అంటారు మీరు వెళ్ళిపోతున్నారు, మేము ఉండి పోతున్నాము అంటారు. నన్ను ఎక్కడికి వెళ్ళమంటారు, ఎక్కడికైనా వెళ్ళటానికి చోటు ఉండాలి కదా, అంతటా ఉన్న వాడిని ఎక్కడికి వెళ్ళమంటారు.

శరీరం ఉండగానే ఈ దేహము నేను అనుకొనే వాడిని అతిక్రమించకపోతే వాడి కర్మానుభవాన్ని బట్టి స్వర్గానికో, నరకానికో ఏదో లోకానికి వెళ్ళిపోతాడు, పుణ్యమో, పాపమో అనుభవిస్తాడు. అనుభవించిన తరువాత మరల శరీరం ధరించి భూమి మీదకు వచ్చేస్తాడు. మనకు ఉన్న అజ్ఞానం పంచదారకంటే, తేనెకంటే మనకు తియ్యగా అనిపిస్తోంది ఇంక మనం దానిని ఎలా పోగొట్టుకోగలము. మనం నోటిలో వేసుకొన్నది చేదుగా ఉంటే ఊసేస్తాము కాని అది బాగా తియ్యగా ఉంటే ఊసేయమన్నా దానిని ఊసేయాలనే బుద్ధి మనకు కలగదు. మాయ ఎక్కడ ఉంది అంటే వాడి అజ్ఞానం వాడికి తియ్యగా ఉంటుంది, వాడిని సాధన చేసుకోమని చెపుతుంది, కోరికలు కావాలంటే కోరుకోమంటుంది కాని అజ్ఞానం తప్పకోదు. మీరు మంచి జన్మ కావాలని కోరుకొంటారు అనుకోండి, మంచిజన్మ కూడా దుఃఖం వచ్చేస్తుంది, ఇది బాగా గుర్తు పెట్టుకోండి. జన్మ వచ్చింది అంటే దుఃఖాన్ని ఎవడూ తప్పించుకోలేడు.

బ్రహ్మం మన హృదయంలో ఉంది. దానిని పూజించటం లేదు, ఆరాధించటం లేదు, దానిని పొందటానికి ప్రయత్నం చేయలేక ఏదో గుడి చుట్టూ తిరిగివస్తున్నారు. మీ హృదయంలో ఉన్న వస్తువును తెలుసుకోవాలంటే మనస్సు అంతర్ముఖం అవ్వాలి. మనకు నేను అనే తలంపు ఉంది. ఈ నేను అనే తలంపు శూన్యంలో నుండి రాలేదు, మన హృదయంలో నుండే వచ్చింది. బయటచూపు వలన ఈ నేను అనే తలంపు ఎక్కడనుండి వచ్చిందో నీకు తెలియదు. మనస్సును లోపలకు తిప్పి ఈ నేను అనే తలంపు ఎక్కడ నుండి వచ్చింది అని వెతకటం ప్రారంభిస్తే అది ఎక్కడ నుండి అయితే వచ్చిందో అక్కడకు జరుగుతూ ఉంటుంది. అలా నెమ్మదిగా జరిగిజరిగి అది మూలంలో ఉండిపోతుంది. నీ మనస్సు శిరస్సులో ఎంత సహజంగా ఉంటుందో అంత సహజంగా మూలతలంపు దాని మూలంలో ఉండగలిగితే అది నశించిపోతుంది, అప్పుడు లోపల ఉన్న బ్రహ్మం నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. అది నీకడసారి జన్మ, ఇంక నీవు శవాలను మోయనక్కరలేదు, ఈ ప్రకృతిలోనికి రానక్కరలేదు. ఎంతో కష్టపడి చదువుకొని డాక్టర్లు అవుతున్నారు. అందులో సగం మీరు కష్టపడినా మీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. అంతేగాని ఏదో లాంఛనం కోసం సాధన చేస్తే వాడికి ఆత్మజ్ఞానం ఎలా కలుగుతుంది. మీకు ఎన్ని తలంపులు వచ్చినా ఈ దొంగ నేనుకే, మీరు కంగారుపడకండి. దుఃఖం ఎవరికి వస్తుంది అహంకారానికే, సంతోషం

ఎవరికి వస్తుంది అహంకారానికే. ఈ రెండూ మీరు సమానంగా చూసుకోలేరు అనుకోండి లోపల అజ్ఞానం పెరిగిపోతూ ఉంటుంది. దేవుడిని ఎలా తెలుసుకోవాలి అని భగవాన్‌ను అడిగేవారు. నువ్వు సుఖంకోసం దేవుడు కావాలనుకొంటున్నావు. ఆ సుఖం నీ హృదయంలోనే ఉంది. అది నీకు అనుభవంలోనికి వచ్చింది అనుకో ఒకవేళ దేవుడు రూపం ధరించి వచ్చినా కళ్ళు అటుతిప్పి చూడాలనిపించదు. అట్టిది ఆ సుఖం. మీరు చేసే జపధ్యానముల వలన దేహాభిమానం తగ్గుతూ ఉంటే మీ లోపల ఉన్న సుఖం మీకు స్వరూపంగా వ్యక్తమవుతూ ఉంటుంది, అది ఇతరులు చెప్పనక్కరలేదు, మీకే తెలుస్తూ ఉంటుంది. నేను శ్రద్ధగా చెపుతూ ఉన్నా మీ మనస్సు ఎక్కడో ఉంటే నా మాటలు వినబడవు, ఒకవేళ వినబడినా వాటిని పట్టించుకోరు. మనస్సు ఎక్కడో ఉంటే మీకు అన్వేషణ సాగదు. బయట విషయాల మీద మీ మనస్సు ఎలా వాలుతోందో అలాగ మనస్సును లోపలకు తిప్పి హృదయంలో ఉన్న వస్తువు మీద మనస్సును పెడితే ఆ వస్తువు దొరుకుతుంది.

సత్వగుణాన్ని జాగ్రత్తగా పెంచుకొంటూ రావాలి, సత్వగుణం వలన ఈ లోకంలో సుఖపడతాము, పరలోకంలో సుఖపడతాము. సత్వగుణం వలన భౌతికంగా అభివృద్ధిలోనికి వస్తాము, శారీరకఆరోగ్యం బాగుపడుతుంది, మానసికఆరోగ్యం బాగుపడుతుంది. సత్వగుణం కూడా గుణమే కాని మన హృదయంలో ఉన్న ఈశ్వరుడి దగ్గరకు దారిచూపించి అది ప్రక్కకు తప్పకొంటుంది. నీ హృదయంలో ఉన్న బ్రహ్మం నీకు అనుభవంలోనికి రాలేదు అనుకో ఈ లోపల దేవుడు కనింపించాడు అనుకో అది మానసిక దర్శనమే, అది దృశ్యమే కాని అది నిజం కాదు. నీ మనస్సు ఎంత నిజమో నీకు కనిపించిన ఆ దేవుడు కూడా అంతే నిజం. తన్ను తాను తెలుసుకొన్నవాడే దైవాన్ని దర్శించినవాడు. నీకు నిజంగా దైవాన్ని తెలుసుకోవాలంటే నీ మనస్సును దైవానికి మేత కింద ఎందుకుపెట్టవు. జ్ఞానం అంటే ఏమిటి అని రామకృష్ణుడిని అడిగితే ఏదైతే నేను, నేను అంటున్నావో ఆనేను నేను కాదని తెలుసుకోవటమే జ్ఞానం, అదే ఆత్మజ్ఞానం అని చెప్పారు. నువ్వు ఎవరినో చంపటంకాదు, ఏదో సాధించటం కాదు నీ అహంభావనను చంపుకో. నీ అహంభావన పోకుండా నీ దేహం చనిపోయింది అనుకో నీకు పునర్జన్మలు వచ్చేస్తాయి. మీరు నేను నేను అంటున్నారు కదా అది కల్పితమే. అది నిజమైతే గాఢనిద్రలో ఎందుకు లేదు? నిజమైతే అది ఎప్పుడూ ఉండాలి కదా! అది నిజంకాదు కాని అది నిజం వలె నీకు కనిపిస్తోంది అంతే, కొద్దిగా

విచారణ చేస్తే అదిపోతుంది. మీ ఇంటి దగ్గర పనులు శ్రద్ధగా చేసుకొంటున్నారు, మీ వ్యాపారాలు శ్రద్ధగా చేసుకొంటున్నారు, సాధనలు మాత్రం మర్యాదకోసం యాంత్రికంగా చేస్తున్నారు. ఇటువంటి మీకా ఆత్మజ్ఞానం కలగటం? సృష్టిలో ఏ వస్తువులోను శాంతి లేదు. నీ కోరిక నెరవేరినప్పడు మనస్సు లోపలకు వెళుతుంది, నీ హృదయంలో ఉన్న శాంతిని కొంచెం రుచి చూస్తుంది. అది బయట పదార్థంలో నుండి వచ్చింది కాదు, బయట ఉంటే కదా రావటానికి. మీకు జున్ను అంటే ఇష్టం అనుకోండి, ఆ జున్ను తిన్నప్పడు మనస్సుకు ఉన్న ఇష్టం సంతృప్తి అవుతుంది, అప్పడు మనస్సు లోపలకు వెళ్ళి హృదయంలో ఉన్న శాంతిని కొంచెం జుర్రుకొంటుంది. మీరు ఏమనుకొంటున్నారు అంటే జున్నులో నుండి శాంతి వచ్చేస్తోంది అనుకొంటారు. జున్నులో నుండి శాంతి రావటం లేదు, జున్ను తినటం వలన మనస్సు సంతృప్తి పడి అది హృదయంలోనికి వెళ్ళి శాంతిగంగలో మునిగి వస్తుంది. జున్నులో శాంతి ఉంటే నేను తింటే నాకు రావాలి కదా మరి నాకు ఎందుకు రావటం లేదు. అది సహజంగా అక్కడ ఉండటం వలన వచ్చిన శాంతి కాదు, మీ కోరిక నెరవేరటం వలన మనస్సు హృదయంలో మునగటం వలన అది వచ్చింది. అయితే బయట కోరిక నెరవేరటం వలన అది లోపలకు ఎలా వెళ్ళిందో అలాగ ఏ కారణం లేకుండా అది లోపలకు వెళ్ళినప్పడు అది నిలబడుతుంది. మనకు భగవంతుడియందు భక్తి ఉండాలి కారణం కనబడకూడదు. కారణం కనబడకుండా ఉంటేనే అది మీకు ఆత్మజ్ఞానానికి దోహదం చేస్తుంది.

శ్రవణం చేసి, మననం చేసి, సాధన చేసి దొంగను నేను పట్టలేకపోయాను, ఈనాటికి దొంగ దొరికాడు అన్నాడు జనకమహారాజు. బయట ఎవరూ దొంగలు లేరు, ఈ నేనే దొంగ అని ఇప్పటికి నాకు అర్థమయ్యింది అన్నాడు. మనకు బయట ఎవరూ విరోధులు లేరు, మనకు మనమే విరోధులం. మన అజ్ఞానానికి మించిన శత్రువుగాని, విరోధిగాని ఈ సృష్టిలో ఎవడూ లేడు. మనం ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రాకుండా ఎవరో అడ్డు వస్తున్నారని అనుకొంటున్నాము కాని మన దేహాభిమానమే మనకు అడ్డు వస్తోంది అన్న సంగతి మనకు తెలియటం లేదు. ఇంత సబ్జక్టు విన్నాక వీడు కదా దొంగ అని నాకు అర్థమయ్యింది. ఇక్కడ నుండి సాధన చేసి ఈ దొంగను చంపుతాను అన్నాడు జనక మహారాజు. రోగనిర్ధారణ అయ్యాక రోగాన్ని పోగొట్టుకోవటం తేలికే, రోగనిర్ధారణే కష్టం. బుద్ధుడు తల్లి పేరు మాయాదేవి. మాయాదేవికి ఒక స్నేహితురాలు ఉండేది. బుద్ధుడికి

నామకరణం చేసేటప్పడు మాయాదేవి ఆ స్నేహితురాలకు కబురు పంపించింది. స్నేహితురాలు వచ్చింది. సిద్దార్ధ అని పేరు పెట్టారు తరువాత బాబును స్నేహితురాలు చేతిలో పెట్టింది. స్నేహితురాలు ఆ బిడ్డను తన ఒడిలో పెట్టుకొని అలా చూస్తూ ఉండిపోయింది, ఆమెకు టైము తెలియలేదు. ఎంతమందికి పుడతారు ఇటువంటి బిడ్డలు, ఈ బిడ్డను చూస్తూ ఉంటే నాకు కాలం తెలియటం లేదు అని చెప్పింది. తరువాత కొంతకాలానికి మాయాదేవి చనిపోయిందని స్నేహితురాలుకు కబురు వచ్చింది. ఆ స్నేహితురాలుకు కన్నీళ్ళు రాలేదు. మాయాదేవికి ఈ లోకంలో పనిలేదు. భూదేవి సిద్దార్ధుడును మనకు ఇవ్వటానికి మాయాదేవి రూపంలో వచ్చింది, ఆవిడ వచ్చిన పని పూర్తి అయిపోయింది, భూమిలో కలిసిపోయింది అని చెప్పింది. తరువాత సిద్దార్ధుడు బుద్ధుడు అయ్యాడు. అప్పడు ఆ స్నేహితురాలు కూడా చూడటానికి వెళ్ళింది. అప్పడు బుద్ధుడు లేచి ఆవిడ దగ్గరకు వచ్చి అమ్మా అన్నాడట. కనటం మాయాదేవి కన్నది కాని నన్ను అమ్మా అని పిలుస్తున్నాడు, ఈ జీవితానికి ఇది చాలు అంది. బుద్ధుడు అమ్మా అని పిలుస్తూ ఉంటే నాకు ఇంక ఏమి కావాలి, నన్ను అమ్మా అని పిలిచి నా అహంకారాన్ని నిర్వీర్యం చేసేసాడు. ఆ మాటతో అన్నీ పూర్తి అయిపోయాయి అంది. బుద్ధుడు చెప్పింది ఏమిటి అంటే మీ శరీరాలు ఏదో రోజున చనిపోతాయి, దానికోసం కనిపెట్టుకొని ఉండకండి, ఆ కాలం వచ్చినప్పడు ఆ శరీరం చనిపోతుంది, అది అంత ప్రధానమైన విషయం కాదు. మీ శరీరం ఈ భూమి మీద తిరుగాడుతుండగానే అహంభావన నశించే ఉపాయం చూసుకోండి.

మనలో మంచితనం లేకపోతే లోకంలో మనకు మంచితనం కనబడదు. ఒక భక్తురాలు బుద్ధుడిని భోజనానికి పిలిచింది. బుద్ధుడు వారింటికి వెళ్ళాడు. ఆవిడను సంతృప్తి పరచటం కోసం రోజూ ఆ అమ్మగారు ఏమంచం మీద పడుకొంటారో ఆ మంచం మీద కూర్చొన్నాడు. చూసినవారు ఏమనుకొంటున్నారు అంటే వీడు రాజవంశంలో పుట్టాడు, ఆ రక్తం ఎక్కడికి పోతుంది, ఇంకా పరుపులను కోరుకొంటోంది అనుకొంటున్నారు. మన మనస్సులో ఏది ఉంటే అదే మనకు బయట కనబడుతుంది. అది చూచే వాడిలో దోషం. బుద్ధుడు అంటే ఎవడో వారికి అర్ధం కావటం లేదు. ఒక అజ్ఞాని జ్ఞానిని ఎప్పడూ అర్ధంచేసుకోలేడు, ఒకవేళ అర్ధం చేసుకోవటానికి ప్రయత్నం చేసినా తన అజ్ఞానాన్ని జ్ఞానిమీద ఆరోపిస్తాడు. జీవితం అన్నీ తలంపులే. ఈ తలంపులన్నీ ఎవరికి వస్తున్నాయి, దేహానికి రావటం లేదు, దేహము నేను అనే

తలంపుకు వస్తున్నాయి. మీకు ఏ తలంపు వచ్చినా కంగారుపడకండి. ఈ తలంపు ఎవరికి వస్తోంది అని ప్రశ్నించండి? నాకు వస్తోంది. ఆ నేను ఎవరు అని ప్రశ్నించుకొనే కొలది ఆ నేను లోపలకు జరుగుతుంది, నెమ్మదిగా దాని పుట్టింటికి వెళ్ళిపోతుంది. నేను తలంపు ఎక్కడి నుండి వచ్చిందో అక్కడకు వెళ్ళి సహజంగా ఉండగలిగితే అది నశిస్తుంది. అది నశించిన వెంటనే నీలో ఉన్న బ్రహ్మం నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. మీరు అందరూ ఇక్కడ కూర్చొన్నారు. మీ మనస్సు బయటకు వెలుతోంది అనుకోండి. అది మీరు నాకు చెప్పకపోయినా మీకు తెలుస్తుంది కదా. అది ఆవరణదోషం. మీరు ఎన్ని జపాలు చేసినా ఆవరణదోషం ఉన్నప్పుడు మనస్సు చలిస్తూ ఉంటుంది. గురువు అనుగ్రహం లేకుండా ఈ దోషం నుండి ఎవరూ బయటకు రాలేరు. నువ్వు యజ్ఞాలు, యాగాలు చేస్తే పుణ్యం రావచ్చుగాని అహంభావనలో నుండి బయటకు రాలేవు. నీ హృదయంలో ఉన్న వస్తువు యొక్క అనుగ్రహం లేకుండా అహంభావన అనే రాక్షసి యొక్క పట్టులో నుండి నీవు బయటకు రాలేవు. పరమాత్మ చెపుతాడు నీవు చేసిన పుణ్యం అంతా ఏదో రూపంలో తిరిగి నీకే ఇచ్చేస్తాను, నాకు ఏమీ అక్కరలేదు. ఆ పుణ్యం ఏదో లోకంలో అనుభవిస్తావు, అనుభవం అయిపోయిన తరువాత తిరిగి ఈ భూమి మీదకు రావలసిందే. నీవు సాధన చేసి, కష్ట సుఖాలను భరించి, గౌరవాలను అగౌరవాలను భరించి వీటిఅన్నింటి మధ్య ఉండి ఇక్కడే ఈ భూమి మీదే నువ్వు బ్రహ్మానుభవం పొందాలి. ఎక్కడో ఇతరలోకాలు ఉన్నాయి చూసావు అవి అన్నీ అయితే పాడులోకాలు లేకపోతే భోగలోకాలు కాని సాధనకు పనికి వచ్చే లోకాలు కాదు. ఈభూమి మీద ఉండగానే కాలాన్ని పాడుచేసుకోకుండా, మానవశరీరాన్ని మాగ్జిమమ్ సద్వినియోగం చేసుకొని ఈశరీరం ఉండగానే ముక్తిని పొందితే నీవు జీవన్ముక్తుడవు అవుతావు.

నీ సాధనను అంతా బ్రహ్మం మీద గురిపెట్టు. బ్రహ్మం మీద గురిపెడితే నా పొట్ట మాట ఏమిటి అని నీవు అడగవచ్చు. బ్రహ్మానుభవం పొందటానికి నువ్వు చేస్తున్న ప్రయత్నం నిజమైతే ఆ బ్రహ్మమే నీకు అన్నీ సమకూరుస్తుంది అని పరమాత్మ చెపుతున్నాడు. ఈ ప్రపంచంలో ఉన్న నామరూపాలు అన్నీ బొమ్మలే. సినిమాలో ఉన్న బొమ్మలు అన్నీ కూడా ఇష్టం వచ్చినట్లు ఏక్షన్ చెయ్యటానికి కుదరదు. డైరెక్టర్ ఎలాగంతులు వేయమంటే అలా గంతులు వేయాలి. ఆ గంతు సరిగా వేయకపోతే కట్, కట్ అంటాడు. అలాగే ఈ ప్రపంచం అనే తెరమీద మనం అందరం ఉన్నాము. మనకు డైరెక్టర్ భగవంతుడు. దేహాలు అంటే

సరదాపడకండి. మహావిష్ణువు శరీరం ధరించినా తిప్పలు తప్పవు. రాముడు కూడా మాటలు అనిపించుకొన్నాడు. దేహం ధరించటం వలన వచ్చే ప్రమాదం చెపుతున్నాను. మీరు మోక్షాన్ని కోరుకోండి అంతేగాని మంచి జన్మలు కావాలని కోరుకోవద్దు. జన్మ వస్తే మనిషి కూడా నీడ వచ్చినట్లుగా దుఃఖం వచ్చేస్తుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 05-02-06, భీమవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం సబ్జక్టును అధ్యయనం చేసి, అర్థం చేసుకొని దానిని ఆచరిస్తే అది మనకు అనుభవంలోనికి వస్తుంది. దీనికి గురువు అనుగ్రహం ఉండాలి. శ్రద్ధ ఉన్నవాడికి సందేహాలు తగ్గుతూ ఉంటాయి. శ్రద్ధ లేకపోతే సందేహాలు ఎక్కువవుతాయి. ప్రతీ మనిషి నేను, నేను అంటాడు. ఆనేను నేను కాదని తెలుసుకోవటమే జ్ఞానం అన్నారు రామకృష్ణుడు. ఇది చిరకాలం, కలకాలం గుర్తుపెట్టుకోవలసిన మాట. లోపల అజ్ఞానం ఉన్నవాడికి దుఃఖం , అజ్ఞానం లేనివాడికి ఎటుచూసినా దుఃఖం కనబడదు. ఈ శరీరమే నేను అని అజ్ఞాని ఎంత స్పష్టంగా అనుకొంటాడో అంత స్పష్టంగా జ్ఞానికి చైతన్యంతో తాదాత్మ్యం ఉంటుంది. మీరు ఎక్కడ ఉన్నారు అనేది ముఖ్యం కాదు, గురువుతో మానసికఅనుబంధం ఉండాలి. మానసిక అనుబంధం వలన గురువు యొక్క దయకు పాత్రులవుతాము, అప్పుడు మనస్సు పవిత్రం అవుతుంది. గురువు చూపులు, మాటలు దయాపూరితమే. దేవుడు అంటే ఉండటమే అన్నారు భగవాన్. మనకు ఎప్పుడూ ఉండాలని ఉంది. ఎవరికి చనిపోవాలని లేదు, ఆ ఉండటమే దేవుడు. మీరు ఎలా ఉన్నారు అంటే మేము ముసలివారం అయిపోయాము, మేము పిల్లకాయలం అంటారు. నేను ఉన్నాను అంటే ఆ ఉండే వస్తువుకు వయస్సు లేదు, గుణం లేదు, రూపం లేదు, నామం లేదు, అది లేదా అంటే ఉంది, అది దాని యొక్క వైభవం.

మనంకాని మనస్సుతోటి, మనంకాని విషయంతోటి, మనంకాని గుణాలతోటి తాదాత్మ్యం పొందటం వలన డిప్రెషన్ వస్తోంది, ఎమోషన్ వస్తోంది. ఇవి అన్నీ మనస్సులో వచ్చే వికారాలు. మనం కానిదానిలో నుండి విడుదల పొందితేనే గాని మనకు జ్ఞానం రాదు. మీకు శరణాగతిభావన కనుక కలిగితే ఇప్పడే మీ అశాంతి అంతా ఆరిపోతుంది.

మీకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా భగవంతుడి సంకల్పమే. భగవంతుడి సంకల్పాన్ని అర్థం చేసుకొనే శక్తి ఉంటే మీకు అశాంతి లేదు, దుఃఖం లేదు. ప్రారబ్ధం ప్రకారం ఈ శరీరం ద్వారా ఏ పనులు జరగాలో ఆ పనులు జరిగిన తరువాత ఈ శరీరం అనే బొంగరం పడిపోతుంది. జీవితంలో మీకు సన్మానాలు, అవమానాలు జరుగుతూ ఉంటాయి, అవి నిజం కాదు. భగవంతుడికి తెలియకుండా ఈ సృష్టిలో ఏమీ జరగటానికి వీలులేదు. అయితే భగవంతుడు వేరు, మనం వేరు అనుకొంటున్నాము కాబట్టి ఆయన సంకల్పాన్ని అంగీకరించలేకపోతున్నాము, అందుచేత అశాంతికి గురి అవుతున్నాము. భగవంతుడు వేరు, నేను వేరు అనే భిన్నభావనలో నుండే మనకు దుఃఖం వస్తోంది. అనుకొనేది జీవసంకల్పం, జరిగేది ఈశ్వరసంకల్పం. ఈశ్వరుడు జీవులను వారి వారి ప్రారబ్ధాన్ని అనుసరించి ఆడిస్తాడు. మన చేతిలో ఉన్న పనిని శ్రద్ధగా చేయటమే, ఫలితం మన చేతిలో లేదు, ఫలితం ఇచ్చేవాడు ఈశ్వరుడు. కర్త భగవంతుడు ఒక్కడే. ఇతరులు ఎవరూ కర్తలు కాదు అని మనకు అర్థమైతే ఇంక దుఃఖం రాదు. చావులు పుట్టుకలు నిజం కాదు, ఇవి నిజంలాగ నీకు కనిపిస్తున్నాయి కాబట్టి నీకు దుఃఖం వస్తోంది. మీ అశాంతికి ఎవరు కారణం అనుకొంటున్నారో వారి హృదయంలో కూడా భగవంతుడు ఉన్నాడు. లోపల భగవంతుడు లేకుండా దేహం ఉండటానికి వీలులేదు. మా మావగారు అన్యాయం చేసారు, అత్తగారు అన్యాయం చేసారు, అన్నగారు అన్యాయం చేసారు అని ఇలా తొంభై రకాలుగా అనుకొంటారు. వారు ఎవరు నీకు అన్యాయం చేయటానికి, వారు కర్తలు కాదు, భగవంతుడు ఒక్కడే కర్త, అది నీకు అర్థమైతే దుఃఖం లేదు.

ఏదో మీరు నలుగురు కూర్చోవటం సత్సంగం కాదు, లోపల ఉన్న సత్యపదార్థంతో, భగవంతుడితో, గురువుతో మానసికఅనుబంధం కలిగి ఉంటే మీరు సత్సంగంలో ఉన్నట్లే. కర్మఫలితం శాశ్వతం కాదు. మీరు ఏదో గొప్ప కర్మ చేస్తారు, ఫలితం వస్తుంది. దానిని అనుభవిస్తే అది పోతుంది. పెద్దపెద్ద సామ్రాజ్యాలే కొట్టుకొని పోయినప్పుడు మీరు ఎంత? మీరు చేసిన కర్మ ఎంత? ఫలితం వస్తే ఆ ఫలితం ఎంతకాలంఉంటుంది. మా అబ్బాయి బాగా చూస్తున్నాడు అంటారు. అది ఎంతకాలం ఉంటుంది. మనుషుల ప్రేమలు నిజం కాదు. జీవుడు గుణాలతో కలిసి ఉంటాడు. సత్వగుణం ఉన్నప్పుడు ఒకలాగ ఉంటాడు, తమోగుణం ఉన్నప్పుడు ఒకలాగ ఉంటాడు, రజోగుణం ఉన్నప్పుడు ఒకలాగ ఉంటాడు. ఆ

ప్రేమలను నమ్మటానికి అవకాశం లేదు. నిజంగా ప్రేమించే వాడు ఈశ్వరుడు ఒక్కడే, మనంకాని శరీరంతో, మనంకాని ధనంతో, చదువుతో తాదాత్మ్యం పొంది గర్వం తెచ్చుకొంటున్నాము, ఆ రకంగా అజ్ఞానం ప్రారంభమవుతోంది, ఉన్న సౌందర్యాన్ని పోగొట్టుకొంటున్నాము. మనం ఎక్కువ చదువుకొంటే, మనకు ఎక్కువ సంపద ఉంటే అందరిలాగ మనం ఎందుకు ఉండలేకపోతున్నాము. అక్కడ పిచ్చితనం ప్రారంభమవుతోంది. మన ఇంద్రియాలతోటి, మనస్సుతోటి, బుద్ధితోటి సంపాదించిన విషయాలతో కలిసిపోయి, అవే మనం అనుకొని లేనిపోని వికారాలు తెచ్చుకొంటున్నాము. మనం సంపాదించిన వస్తువులు ఇక్కడే ఉంటాయి కాని మనలో ఉన్న వికారాలు మరణానంతరం మన కూడా వస్తాయి, ఎందుచేతనంటే కర్మ అనుభవించటానికి.

మీకు చదువు ఉన్నా, డబ్బు ఉన్నా నార్మల్‌గా ఉండాలి, సింపుల్‌గా ఉండాలి. జ్ఞానానికి మించిన సంపద లేదు, జ్ఞానాన్ని సంపాదించుకోవటం ముఖ్యం, అదే గమ్యంగా పెట్టుకో. మన హృదయంలో చావులేని సత్యవస్తువు ఉంది. ఉండటం వేరు, వ్యక్తమవ్వటం వేరు. హృదయంలో ఉన్న సత్యవస్తువు మనకు వ్యక్తమవ్వాలి. మనం నేను, నేను అంటాము. ఆ నేను నేను కాదని తెలుసుకొనే వరకు మన హృదయంలో ఉన్న సత్యవస్తువు మనకు వ్యక్తం కాదు అంటే మనకు తెలియబడదు. అది తెలియబడితే మోక్షం, శాంతి. అప్పుడు ఈ దేహం ఉండటానికి, లేకపోవటానికి బేధం పోతుంది. నామరూపాలు అనేవి ఒక పెద్దఅడవి. దుఃఖం అంతా నామరూపముల వలననే వస్తోంది. గురువు అనుగ్రహం లేకుండా ఈ నామరూపముల నుండి బయట పడలేము. మన మనస్సు శుచి అవ్వకుండా ఈ నామరూపములే మనకు అడ్డు వస్తున్నాయి. మనం ఎంతసేపు నామరూపములను చూస్తున్నాము కాని అంతర్యామిగా ఉన్న నారాయణుని చూడలేకపోతున్నాము. నామము, రూపము, క్రియ ఈ మూడింటిని ప్రక్కన పెడితే ఉన్న వాడు నారాయణుడే. మీరు చెడ్డవారు అంటే మీకు కోపం వస్తుంది అంటే మంచిగా ఉండాలని మీరు అనుకొంటున్నారు కాబట్టి కోపం వస్తోంది. ఇవి అన్నీ మనస్సుకు సంబంధించిన విషయాలు. కొన్ని అనుభవాలు అయితేగాని మనస్సు అంతర్ముఖం అవ్వదు. మనస్సు అంతర్ముఖం అయితే కాని ఆత్మజ్ఞానం రాదు. అన్ని జ్ఞానాలకు, అన్ని ప్రయత్నాలకు, అన్ని సాధనలకు పరిసమాప్తి ఆత్మజ్ఞానం.

జీవుడికి భోగకాంక్ష ఎక్కువగా ఉంటుంది. భోగ ప్రవృత్తిలో నుండి మనస్సును

మళ్ళించేవాడే గురువు, అది గురువుకే సాధ్యం. కేవలం మన బుద్ధి చాతుర్యం వలన లోపల ఉన్న వస్తువును పొందలేము, మనస్సుతో దానిని తెలుసుకోలేము. మనస్సు ఎక్కడైతే అణిగిందో అక్కడ ఆ వస్తువు మనకు తెలియబడుతుంది. గురువు అనుగ్రహం మనకు అందుతూ ఉంటే నామబుద్ధి, రూపబుద్ధి తగ్గుతూ ఉంటుంది. మనం ఎంతసేపు నామరూపములను పట్టుకొని తిరుగుతూ ఉంటాము. ఈ రూపము మీద కోపం వస్తే ఇంకోరూపం పట్టుకొంటాము. ఇలా రూపముల మధ్య తిరుగుతూ, చివరకు ఏదో రూపం పట్టుకొని చనిపోతారు. రూపము పట్టుకొని ఏడుస్తూ చనిపోయేవారికి మరల రూపం రాక ఏమౌతుంది, అదే పునర్జన్మ. నీకు లోపల ఉన్న సుఖం, శాంతి అందటం లేదు అందుచేత నీ మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తోంది. ఆవుకు ఇంటిలో పచ్చిగడ్డి పెడితే ఇంక అది బయటకు రాదు, పచ్చగడ్డి వేయకపోతే గడ్డి కోసం రోడ్డు మీదకు వచ్చేస్తుంది. అలాగే మీ మనస్సుకు లోపల ఉన్న ఆత్మానందం దొరికితే అది బజారులోనికి రాదు, ఇంక దానికి జపతపములతో పనిలేదు.

ఇప్పుడు మీరు ప్రాపంచిక విషయాలతో ఎంత అనుబంధం పెట్టుకొంటున్నారో గురువుతో అంత అనుబంధం పెట్టుకొంటే మీలో ఉన్న బలహీనతలు అన్నీ ధ్వంసమవుతాయి, మీకు ఉన్న అలవాట్లలో నుండి, కోరికలలో నుండి బయటకు వచ్చేస్తారు, ఈ శరీరం ఉండగానే ముక్తి సుఖాన్ని పొందుతారు. ఏ కారణాల వలన మీ మనస్సు బాహ్యముఖమవుతోందో ఆ కారణాలు గురువు అనుగ్రహం వలన మీకు తెలియకుండానే బయటకు పోతాయి. కారణంపోతే కార్యం పోతుంది. దుఃఖానికి కారణం అజ్ఞానం. అజ్ఞానంపోతే దుఃఖం పోతుంది. పూర్వపుణ్యం లేకపోతే సబ్జక్టు విన్నా మనకు అర్థం కాదు. సాధన అవసరమే కాని అంతమాత్రంచేతనే లోపలఉన్న వస్తువు మనకు అనుభవంలోనికి రాదు. ఈశ్వరానుగ్రహం లేకపోతే మనం సాధన చేసిన ఆయన స్వరూపం మనకు ఇవ్వడు. ఎంతోకొంత మనపని మనం చేసుకోవాలి, పని దొంగలం అవ్వకూడదు. భారం భగవంతుడి మీద వేయటం నేర్చుకోవాలి, మన చేతిలో ఉన్న పనిని శ్రద్ధగా చేయాలి. సజ్జన సాంగత్యం వలన జపతపాలతో సంబంధం లేకుండా నీ దేహాభిమానం తగ్గిపోతుంది. దేహము నేను అనే బుద్ధి వలననే సుఖం, దుఃఖం, వేదన, రోదన ఈ అడవి అంతా వస్తోంది. దేహబుద్ధి నశించినప్పుడు నీలో ఉన్న అశాంతి, దుఃఖం కూడా అప్పటికప్పుడు ఆరిపోతాయి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 06-06-06 | మంగళ | జిన్నూరు, శ్రీ రమణ క్షేత్రం |
| 11-06-06 | ఆది | పాలకొల్లు, క్షత్రియ కళ్యాణ మండపం |
| 28-06-06 | బుధ | జిన్నూరు, శ్రీ రమణ క్షేత్రం |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

# నిర్మలమైన మనస్సుకే - నిశ్చల స్థితి కలుగుతుంది

వేదాంతం ప్రకారం వర్జించటం అంటే సంపూర్ణంగా వదిలివేయటం. ఆ పరిత్యాగం వల్లనే నిజమైన విశ్రాంతి దొరుకుతుంది. ఒక మహారాజు రాణితో సత్యాన్వేషణకై అన్ని సంపదలు వదలి కట్టుబట్టతో అడవికి వెళ్ళాడు ఆ రాత్రి రాజుకు బాగా నిద్రపట్టింది. రాణికి కంటిమీద కునుకు లేదు కారణం రాజు అడిగితే మొలలో అవసరానికి దాచుకొన్న వజ్రాల హారం దొంగలు దోచుకొంటారని తెలిపింది. రాజు ఆ నగను ఆవతల పారేసిన రోజు నుంచి ఆమె సుఖంగా నిద్రించింది. మన దేహభారాన్ని మనం మొయ్యటం లేదు అన్నట్లుగా మన దేహాన్ని కుర్చీ మీద విశ్రమింపజెయ్యాలి, నిశ్చలంగా కాసేపు పడుకోనియ్యాలి. మన మనస్సులో ఏ ఆందోళనా రానియ్యకుండా, సమస్త వాంఛ ఆశయాలు, ఊహలు విడిచిపెట్టాలి. అది వర్జించటమంటే మనకు ఉన్న వస్తుజాలాన్ని అంతా భూమి మీదనే ఉండనియ్యాలి, కానీ గుండెలమీద పెట్టుకోకూడు. "మనస్సు మీద నిఘా పెట్టగలిగినవాడే మేధావి" అంటారు. ఎవరైనా మరణించారు అనుకోండి అందులో అసహజమైనది ఏముంది? అలాగే గాలి వీస్తే అసహజత్వం ఏముంది, నది ప్రవహిస్తే నది అని ఒకడు ఆశ్చర్యంగా అంటాడు. అందులో ఏముంది? దానికి తల్లక్రిందులు కావటం దేనికి. పుట్టిన ప్రతీవాడు చనిపోవటానికే పుడతాడు. తరగతిలో ఒక్కొక్క క్లాసు పైకి వెళ్ళటం లేదా? "శ్రద్ధ" పరిపూర్ణానికే ఇది అంతా. మన గోళ్ళను మనం తీసుకోవటం లాంటిదే ఈ దేహ మరణాలు అంటారు పెద్దలు. ఈ నిజాన్ని నమ్మాలి, నమ్మి తీరాలి. పుట్టిన లగాయితు స్మశానానికి వెళ్ళేవరకూ ఎటువంటి అనుభవాలు పొందాలో తల్లి గర్భంలో ఉండగానే నిర్ణమైనదని నమ్మితే మనస్సుకు నిశ్చలస్థితి రాకుండా ఉంటుందా? శ్రీనాన్నగారు "తెలివి యొక్క ప్రయోజనం ఇతరుల మోసాలలో పడకుండా ఉండటానికి మాత్రమే" అన్నారు. కట్టెలు వేసే కొలది అగ్ని ప్రభలుతుంది. చింతపడిన కొద్దీ చింత అధికమౌతుంది. కట్టెలు వెయ్యకపోతే అగ్ని ఆరిపోతుంది. చింతించకపోతే చింత ఆగిపోతుంది. ఆశలేని మనస్సు ప్రకాశించినట్లు పూర్ణచంద్రుడు గాని, పాల సముద్రంగాని లక్ష్మి మొఖంగాని ప్రకాశించదు అంటారు. అరణ్యంలో సీత నిర్మల తటాకాన్ని చూచి ఆనందపడితే రాముడు అంటాడు "ఔను సత్‌పురుషుని హృదయంలా ఉంది" అని. ఆ నిశ్చలస్థితిని గురుకరుణను ఆసరాగా తీసుకొని సాధించాలి. అదే జీవిత లక్ష్యం.

**– సాగిరాజు రామకృష్ణంరాజు,** అర్థవరం



ది॥ 04–05–06 తఃబుకు సజ్జాపురం
ఇన్‌కంటాక్స్ రోడ్‌లో
శ్రీ జానకి హాస్పటల్‌ను ప్రారంభించిన
డా॥ టి. రామబ్రహ్మంగారు.
ప్రక్కన
డా॥ ముదునూరి వెంకట సుబ్బరాజు, M.S.,
డా॥ ముదునూరి ఇందిర, M.B.B.S., DGO

కన్సల్టేషన్ రూంలో
డా॥ ముదునూరి
వెంకట సుబ్బరాజు,
M.S.,

